తెలుగు దినపత్రిక

# కబురు

KABURU TELUGU DAILY

RNI APTEL/1999/00110

సంపుటి : 23 సంచిక : 38 | బుధవారం జనవరి 22 2025 | ఎడిటర్: శివకుమార్ గౌడ్ | పేజీలు 8 | వెల-5


**అవతార్ 3..**

**ప్రేక్షకుల ఊహకు మించి ఉంటుంది**

8 లో..

**ఇదండీ..కబురు..**






## దావోస్‌లో తెలంగాణ పెట్టుబడుల వేట

- కామారెడ్డిలో పామాయిల్ యూనిట్ ఏర్పాటు
- తెలంగాణ ప్రభుత్వంతో యూనిలీవర్ ఒప్పందం



**కబురు,హైదరాబాద్ జనవరి 21:**

కామారెడ్డి జిల్లాలో పామాయిల్ తయారీ యూనిట్ ఏర్పాటుకు యూనిలీవర్ ముందుకు వచ్చింది. ఇక్కడ పామాయిల్ పెంపకం కారణంగా యూనిట్ పెట్టాలని దావోస్‌లో జరిగిన సమావేశంలో సిఎంరేవంత్ చేసిన సూచనలను అంగీకరించిందని చెప్పారు. తెలంగాణలో బాటిల్ క్యాప్‌ల తయారీ యూనిట్‌ను నెలకొల్పేందుకు కూడా సంసిద్ధత వ్యక్తం చేసిందని సీఎం రేవంత్ బృందం పేర్కొన్నది. దావోస్‌లో వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ వార్షిక సదస్సులో తెలంగాణ రాష్ట్రానికి పెట్టుబడుల వేట ప్రారంభమైంది. ఈ మేరకు ప్రభుత్వం తొలి ఒప్పందం కుదుర్చుకుంది. దావోస్‌లో యూనిలీవర్ సీఈఓ హీన్ షూమేకర్, చీఫ్ సప్లై చైన్ ఆఫీసర్ విల్లెం ఉయిజెన్‌తో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి , ఐటీశాఖ మంత్రి శ్రీధర్ బాబు ,అధికారుల బృందం మంగళవారం సమావేశమయ్యారు. యూనిలీవర్ వంటి గ్లోబల్ దిగ్గజ సంస్థ తెలంగాణలో పెట్టుబడులు పెట్టడం, వ్యాపార అవకాశాలపై సీఎం రేవంత్ బృందం చర్చించారు. ఈ మేరకు దావోస్ పర్యటనలో తొలి ఒప్పందం చేసుకున్నారు. యూనిలివర్ కంపెనీ గ్లోబల్ సీఈవోతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జరిపిన చర్చలు విజయవంతమయ్యాయని తెలంగాణ ప్రతినిధుల బృందం తెలిపారు. వినియోగ వస్తువుల తయారీలో ప్రపంచంలోనే పేరొందిన బ్రాండ్‌లలో ఒకటైన యూనిలీవర్ తెలంగాణలో పెట్టుబడులకు సంసిద్ధత వ్యక్తం చేసిందని చెప్పారు. తెలంగాణలో తయారీ యూనిట్లను ఏర్పాటు చేసేందుకు ప్రపంచ దిగ్గజ సంస్థ యూనిలీవర్ ఒప్పందం కుదుర్చుకుందని అన్నారు. కామారెడ్డి జిల్లాలో పామాయిల్ తయారీ యూనిట్ ఏర్పాటుకు అంగీకరించిందని చెప్పారు. తెలంగాణలో బాటిల్ క్యాప్‌ల తయారీ యూనిట్‌ను నెలకొల్పేందుకు కూడా సంసిద్ధత వ్యక్తం చేసిందని సీఎం రేవంత్ బృందం పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జనవరి 16 నుంచి 19 వరకు సింగపూర్, 20 నుంచి 22 వరకు దావోస్‌లో పర్యటించనున్నారు. ఆయన వెంట మంత్రి శ్రీధర్‌బాబు ఉంటారు. సింగపూర్‌లో స్కిల్ యూనివర్సిటీతో ఒప్పందాలు చేసుకుంటారు.

వివరాలు 2 లో..



## పదేళ్లల్లో ఒక్కరేషన్ కార్డయినా ఇచ్చారా

**ఇస్తున్న మాపైన విమర్శలు చేయడం దారుణం**

**ఇలాంటి వారుని ప్రజలు నమ్మొద్దన్న మంత్రి పొన్నం**

**కబురు,హైదరాబాద్ జనవరి 21:**

పదేళ్ల కాలంలో ఒక్కటంటే ఒక్క రేషన్ కార్డు ఇవ్వని బిఆర్ఎస్ వాళ్లు ఇప్పుడు విమర్శలుచేయడం విడ్డూరంగా ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఇలాంటి వారి మాటలు నమ్మవద్దని ప్రజలకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం జనవరి 26 నుండి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 4 పథకాలు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా విషయంలో ప్రజలు ఎవరు అందోళన చెందవద్దు.. అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాల లబ్ది జరుగుతుందని మంత్రి అన్నారు.గ్రామాల్లో గ్రామ సభలు, వార్డు సభలు జరుగుతుండడంతో అక్కడికి వెళ్లి అధికారుల వద్దకు రేషన్ కార్డులు రానివారు కానీ, ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక విషయంలో గ్రామ సభల్లోనే ఎంపిక చేయనున్నారని ఆయన తెలిపారు. ఎవరికైనా అర్హత ఉండి రానివారు ఉంటే గ్రామ సభలో దరఖాస్తులు పెట్టుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు మంత్రి పొన్నం. ప్రజలు ప్రతిపక్షాల మాటలు నమ్మవద్దు .. వారు గత 10 సంవత్సరాల్లో ఒక్క రేషన్ కార్డు అయినా ఇచ్చారాఅని ఆయన ప్రశ్నించారు. రైతు భరోసా పథకం ద్వారా ప్రస్తుతం ఉన్న 10 వేల రూపాయలను 12 వేలకు పెంచడం జరిగిందన్నారు మంత్రి పొన్నం ప్రభాకర్. దేశంలోనే మొదటి సారిగా భూమి లేని ఉపాధి హామీ రైతు కూలీలకు 12 వేలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ప్రజా సంక్షేమ పథకాలు అందిస్తుందన్నారు.

2 లో

## రియల్‌ఎస్టేట్ బ్రోకర్‌పై చేయిచేసుకున్న ఎంపీ ఈటల

**మేడ్చల్ మల్కాజిగిరి,జనవరి21:**



రియల్ ఎస్టేట్ బ్రోకర్‌పై మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ చేయి చేసుకోవడం సంచలనంగా మారింది. జిల్లాలోని పోచారం మున్సిపాలిటీ ఏకశిల నగర్‌లో ఎంపీ పర్యటించారు. ఓ రియల్ ఎస్టేట్ బ్రోకర్ పేదల భూములు కబ్జా చేసి ఇబ్బందులు పెడుతున్నారని ఎంపీకి విన్నవించారు. ఈ నేపథ్యంలో పేదల భూములు కబ్జా చేయడంతో ఆగ్రహించిన రాజేందర్ స్థిరాస్తి వ్యాపారిపై దాడి చేశాడు. ఇదే సమయంలో ఎంపీ అనుచరులు, బాధితులు సైతం రియల్ ఎస్టేట్ వ్యాపారిపై దాడికి పాల్పడ్డారు. కాగా, రద్దయిన ఏకశిల వెంచర్లో రియల్ బ్రోకర్స్ అమాయక ప్రజలకు ప్లాట్లు అమ్ముతున్నారు. ఈ నేపథ్యంలో ఎంపీ ఈటల బ్రోకర్లపై చేయి చేసుకున్న వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

## కొనసాగుతున్న ఎన్‌కౌంటర్

**16కు చేరిన నక్సల్స్ మృతుల సంఖ్య**

**కబురు,ఛత్తీస్‌ఘడ్,జనవరి 21:**

ఛత్తీస్‌గఢ్-ఒడిశా సరిహద్దుల్లోని గరియాబంద్ జిల్లాలో భారీ ఎన్‌కౌంటర్ చోటు చేసుకున్న విషయం తెలిసిందే. కులారీ ఘాట్ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు, భద్రతా బలగాలకు మధ్య మంగళవారం ఉదయం కూడా ఎదురుకాల్పులు జరిగాయి. రెండు రోజులుగా కొనసాగుతున్న ఈ ఎన్‌కౌంటర్‌లో మొత్తం 16 మంది మావోలు హతమయ్యారు సోమవారం జరిగిన ఆపరేషన్‌లో.. ఇద్దరు మహిళా నక్సలైట్లు మృతిచెందగా, ఓ కోబ్రా జవాన్ గాయపడినట్లు పోలీసులు వెల్లడించారు.

మిగతాది 2లో



## కాంగ్రెస్‌ది రైతు రాజ్యం కాదు..

# వంచన రాజ్యం

- రైతుల శాపనార్థాలతో కాంగ్రెస్ ప్రభుత్వం కూలుతుంది
- ట్విటర్ వేదికగా కేటీఆర్ విమర్శలు



**కబురు,హైదరాబాద్ జనవరి 21:**

ఇది రైతు రాజ్యం కాదని, రైతు వంచన రాజ్యమని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. ఒకే రోజు నలుగురు రైతులను పొట్టన పెట్టుకున్న ప్రభుత్వమిదని మండిపడ్డారు. ముమ్మాటికీ రైతులను ఆదుకునే సంక్షేమ ప్రభుత్వం కాదని, తోడేళ్లలా ప్రాణంతీసే క్రూరత్వాన్ని నింపుకున్న ఇందిరమ్మ రాజ్యమని కేటీఆర్ చెప్పారు. కాంగ్రెస్ కాదు ఇది ఖూనీకోర్. ఆత్మహత్యలు కాదివి ముమ్మాటికి మీరు చేసిన హత్యలే అని అన్నారు.


మిగతాది 2లో

## పోలీస్ పహారా మధ్య గ్రామసభలు

- ప్రజా వ్యతిరేకతకు ఇదే నిదర్శనం
- మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు

**కబురు,హైదరాబాద్ జనవరి 21:**

ప్రజాపాలన కాదు, మీది ముమ్మాటికీ ప్రజా వ్యతిరేక పాలన అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఉద్దేశించి మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు విమర్శించారు. మీ సోకాల్డ్ ప్రజాపాలన పట్ల ప్రజలు ఎంత ఆగ్రహంతో ఉన్నారో ఇప్పటికైనా అర్థమైందా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఎంతో ఆడంబరంగా నిర్వహిస్తున్న గ్రామ సభల సాక్షిగా మీ ప్రభుత్వంపై ప్రజల్లో నెలకొన్న వ్యతిరేకత తేటతెల్లమైందని అన్నారు.




## చిత్ర నిర్మాతల ఇళ్లపై ఐటి దాడులు

**దిల్ రాజు, మైత్రీ మూవీ మేకర్స్ ఇళ్లు కార్యాలయాల్లో సోదాలు**



**కబురు,హైదరాబాద్ జనవరి 21:**

హైదరాబాద్‌లో మరోమారు ఐటి సోదాలు కలకలం రేపాయి. ప్రముఖ నిర్మాత, తెలంగాణ ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు ఇళ్లు, కార్యాలయాల్లో ఐటీ అధికారుల సోదాలు కొనసాగుతున్నాయి. దీనితో పాటు ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీస్ కార్యాలయాలు, 'పుష్ప 2' చిత్రం నిర్మాత నవీన్ ఎర్నేని నివాసంలో సోదాలు జరుగుతున్నాయి.

మిగతాద్ది 2 లో

తెలుగు దినపత్రిక RNI APTEL/1999/00110
కబురు
KABURU TELUGU DAILY

## సంపాదకీయం

# తప్పు ఎవరిది? శిక్ష ఏమిటి?



దేశాన్ని అట్టుడికించిన కేసులో కోర్టు తీర్పు వెలువడింది. తీరా తీర్పు సైతం ఆ కేసులానే చర్చకు దారి తీస్తోంది. కోల్‌కతాలోని ఆర్.జి. కర్ ఆస్పత్రిలోని సెమినార్ గదిలో విశ్రాంతి తీసుకుంటున్న జూనియర్ డాక్టర్‌పై గత ఆగస్ట్ 9న జరిగిన దారుణ హత్యాచార ఘటనపై తాజా తీర్పు సహేతుకం కాదనే విమర్శ వినిపిస్తోంది. ఆస్పత్రిలో వాలంటీరైన సంజయ్ రాయ్ భారతీయ న్యాయ సంహిత లోని వివిధ సెక్షన్ల కింద నేరస్థుడంటూ శనివారమే కోర్ట్ ప్రకటించేసింది.కానీ, ఈ కేసులో అతనికి ఉరిశిక్ష బదులుగా యావజ్జీవ కారాగారవాస శిక్ష మాత్రమే విధిస్తున్నట్టు సియాల్దాలోని అడిషనల్ జిల్లా, సెషన్స్ కోర్ట్ సోమవారం తీర్పు చెప్పేసరికి మళ్ళీ తేనెతుట్టె కదిలింది. బెంగాల్‌లోని మమతా బెనర్జీ సర్కారే కాక, అటు కేంద్ర నేరదర్యాప్తు సంస్థ (సీబీఐ), ఇటు బాధితురాలి కుటుంబం సైతం నేరస్థుడికి ఉరిశిక్ష విధించాలంటూ వాదించింది. కానీ, అంతటి తీవ్ర శిక్ష విధించేందుకు హేతుబద్ధత లేదంటూ కోర్ట్ వ్యాఖ్యానించడం గమనార్హం. దాంతో, మహిళా లోకంలో, బాధిత, వైద్య వర్గాల్లో అసహనం కట్టలు తెంచుకుంది. సామాజిక మాధ్యమాల్లోని దృశ్యాలే అందుకు నిదర్శనం.హత్యాచారానికి గురైన ఆడకూతురు, ఆమె కుటుంబం బాధను ముగ్గురు ఆడపిల్లలకు తల్లినైన తాను అర్థం చేసుకోగలనంటూ నేరస్థుడి తల్లే స్వయంగా అనడం గమనార్హం. కన్నకొడుకైనా సరే నేరం రుజువైతే, శిక్ష పడాల్సిందేనని ఆ మాతృమూర్తి అన్న మాటలు జరిగిన ఘటన రేపిన భావోద్వేగాలను గుర్తు చేస్తుంది. పైపెచ్చు, ఆగస్ట్ 9 తర్వాత బెంగాల్‌లో అయిదు హత్యాచార ఘటనల్లో, మైనర్లపై దారుణానికి పాల్పడ్డ నేరస్థులకు 'పోక్సో' కోర్టులు ఏకంగా మరణశిక్షే విధించాయి. అందుకే, ఈ కేసులోనూ నేరస్థుడికి ఉరిశిక్ష పడుతుందనీ, పడాలనీ బలమైన భావన వ్యాపించింది. అయితే జరిగింది వేరు. బెంగాల్‌నే కాక అప్పట్లో భారత్ మొత్తాన్నీ కదిలించిన ఈ ఘటనలో బాధిత కుటుంబానికి రూ. 17 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలంటూ ప్రభుత్వాన్ని న్యాయమూర్తి ఆదేశించారు. అయితే, ఈ ఘటన ఉరిశిక్ష విధించాల్సినంత అత్యంత అరుదైన కేసు ఏమీ కాదంటూ కోర్ట్ వ్యాఖ్యానించడం వివాదాస్పదమైంది. బెంగాల్ ఏలిక మమతా బెనర్జీ సైతం తీర్పుతో సంతృప్తికరంగా లేమంటూ కుండబద్దలు కొట్టేసి, తీర్పుపై హైకోర్టుకు వెళతామని తేల్చేశారు. సర్వసాధారణంగా నేరం తాలూకు తీవ్రత, సమాజంపై దాని ప్రభావం, నేరస్థుడి గత చరిత్ర, ప్రవర్తన లాంటివన్నీ మరణశిక్ష విధింపునకు ప్రాతిపదిక అవుతాయి. అయితే, గౌరవ న్యాయస్థానం తన ముందున్న సాక్ష్యాధారాలను బట్టి మాత్రమే ఎలాంటి తీర్పునైనా ఇస్తుంది. తీర్పు చెబుతూ న్యాయమూర్తి సైతం ఆ మాటే అన్నారు. అంతేతప్ప, మీడియాలో సాగుతున్న ప్రచారం సహా ఇతరేతర కారణాలను బట్టి శిక్షపై నిర్ణయం తీసుకోవడం జరగదు. కాబట్టి, తగినంత బలమైన సాక్ష్యాధారాలు లేనందు వల్లనే ఈ కేసులో నేరస్థుడికి కోర్ట్ మరణశిక్ష విధించలేదా అన్నది ఆలోచించాల్సిన అంశం. తీర్పు పూర్తి పాఠం అందుబాటులోకి వచ్చిన తర్వాత కానీ ఆ అంశంపై మరింత స్పష్టత రాదు. ఆస్పత్రి సిబ్బంది భద్రత కోసం పనిచేయాల్సిన వాలంటీర్ రాయ్ అసలు తన ఉద్యోగ ధర్మాన్నే మంటగలిపి, కాపాడాల్సిన డాక్టర్‌నే కాటేశాడన్నది చేదు నిజం. అతడు చేసిన నేరం ఘోరం, హేయమన్నదీ నిర్వివాదాంశం. అయితే, హత్యాచారానికి పాల్పడ్డ సదరు నేరస్థుడు జీవితంలో మారే అవకాశం లేదంటూ ప్రాసిక్యూషన్ బలంగా వాదించలేక పోయింది. ఆ మాటను నిరూపించలేక పోయింది. అది కూడా శిక్ష విషయంలో నేరస్థుడికి కలిసొచ్చిందని నిపుణుల మాట.కోల్‌కతా కేసు దర్యాప్తు ఆది నుంచి అనుమానాలకు తావివ్వడం దురదృష్టకరం. నిజానిజా లేమో కానీ, అత్యంత హేయమైన ఈ ఘటనలో శిక్షపడ్డ నేరస్థుడే కాక, ఇంకా పలువురి హస్తం ఉంద నేది అందరి నోటా వినిపిస్తున్న మాటే. స్థానిక పోలీసుల నుంచి చివరకు సీబీఐ చేతుల్లోకి దర్యాప్తు వెళ్ళినా జనంలో అనుమాన నివృత్తి కాలేదన్నది నిష్ఠురసత్యం. సీసీ టీవీ దృశ్యాల్లో 68 దాకా రాకపోకలు కనిపించినా, రాయ్ ఒక్కరినే గుర్తించారన్న ఆరోపణలే అందుకు సాక్ష్యం.పనికి మాలిన రీతిలో దర్యాప్తు జరిగిందనీ, పలుకుబడి గల బడాబాబులు తప్పించుకున్నారనీ, ఆఖరికి ఒకడే నేర స్థుడని తీర్మానించి యావజ్జీవ ఖైదుతో సరిపెట్టారనీ విమర్శలు వెల్లువెత్తడానికి కారణమూ అదే. ఆర్.జి. కర్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్ ప్రిన్సిపాల్ సహా పలువురి వ్యవహారశైలి, ఆశ్రిత పక్ష పాతం, అవినీతి ఆరోపణలు, ఆస్పత్రి యంత్రాంగం పనితీరు, వగైరా... ఎన్నో ప్రశ్నల్ని ముందుకు తెచ్చాయి. సాక్ష్యాధారాల తారుమారు యత్నంలో ప్రిన్సిపాల్‌ను సీబీఐ అరెస్ట్ చేసినా, నిర్ణీత 90 రోజుల వ్యవధిలో ఛార్జ్‌షీట్ దాఖలు చేయకపోయే సరికి నిష్పూచీగా ఆయన బయటకొచ్చారంటే మన నిఘా, దర్యాప్తు సంస్థలు ఎంత ఘనంగా పనిచేస్తున్నాయో ఇట్టే అర్థం చేసుకోవచ్చు.కీలకమైన మరో విషయం – ఈ ఘటనకు కారణమైన పరిస్థితులు. ప్రగతి బాటలో ముందున్నా మనే దేశంలో... పనిప్రదేశాల్లో సైతం మహిళలకు రక్షణ కొరవడడం, ఉద్యోగస్థలాలు స్త్రీలకు సురక్షితంగా లేకపోవడం శోచనీయం. కోల్‌కతా ఘటనతో పార్టీలు, ప్రజలు కదం తొక్కిన మాట నిజమే కానీ, ఇప్పటికైనా ఈ పరిస్థితుల్ని సమూలంగా మార్చాల్సిన అవసరం పాలకులకుంది. అవినీతి పంకిలమై, లోపభూయిష్ఠంగా నడుస్తున్న అనేక వ్యవస్థల్ని చక్కదిద్దాల్సి ఉంది. ఈ పరిస్థితుల్లోనే కోర్టులు ఉన్నంతలో సత్వర న్యాయం అందించడం, ప్రజాభిప్రాయం కన్నా ప్రత్యక్ష సాక్ష్యాలే ప్రాతి పదికగా తీర్పులివ్వడం ఆహ్వానించదగ్గదే. అయితే, చాలా సందర్భాల్లో న్యాయం చెప్పడమే కాదు... న్యాయమే చేస్తున్నట్టు కనిపించడం ముఖ్యం. ఈ కేసులో అది జరిగిందా అన్నదే పలువురి ప్రశ్న.

# కాంగ్రెస్‌ది రైతు రాజ్యం కాదు..

# వంచన రాజ్యం

మొదటిపేజీ తరువాయి

రుణమాఫీ చేయనందుకే ఈ ఆత్మహత్యలని అన్నారు. రైతుబంధు వేయకుండా చేసిన ఖూనీలు. ఆ కుటుంబాల మనోవేదనలే మీ సర్కారుకు మరణ శాసనం రాస్తాయని చెప్పారు. వారి కన్నీళ్లే కపట సర్కార్‌ను కూల్చి వేస్తాయని ఎక్స్ వేదికగా కేటీఆర్ నిప్పులు చెరిగారు. రాష్ట్రంలో ఆందోళనకర స్థాయికి చేరిన రైతు ఆత్మహత్యలు, వ్యవసాయ సంక్షోభ పరిస్థితులపై బీఆర్ఎస్ పార్టీ 9 మందితో కూడిన అధ్యయన కమిటీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ కమిటీ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పర్యటించి క్షేత్రస్థాయిలో నెలకొన్న దుర్భరమైన పరిస్థితులపై అధ్యయనం చేసి ప్రభుత్వానికి, వ్యవసాయ శాఖ మంత్రికి, వ్యవసాయ కమిషన్‌కు, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నివేదికను అందజేస్తుందని కేటీఆర్ తెలిపారు. రెండు వారాలపాటు విస్తృతంగా పర్యటించి రైతు ఆత్మహత్యలకు దారితీస్తున్న ప్రధానమైన కారణాలతోపాటు రాష్ట్రంలో ఏడాది నుంచి వ్యవసాయ సంక్షోభానికి దారితీసిన పరిస్థితులను పరిశీలించి నివేదిక తయారు చేస్తుందని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో సన్న, చిన్నకారు, కౌలు రైతులను కలిసి వారి సమస్యలను తెలుసుకుంటుందని వివరించారు. రాష్ట్ర రైతాంగానికి అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఏడాది పాలనలో ఆత్మహత్యలు విపరీతంగా పెరిగిపోయాయని కేటీఆర్ ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికే 400 మందికి పైగా రైతన్నలు ఆత్మహత్య చేసుకున్న ఆందోళనకర పరిస్థితి రాష్ట్రంలో నెలకొన్నదని వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం చెప్పిన రైతు రుణమాఫీ కనీసం 30 శాతాన్ని దాటకపోవడం, రైతన్నలకు కొన్ని సంవత్సరాలుగా అందుతున్న రైతుబంధును ఆపి, ఇస్తామన్న రూ.15 వేల రైతు భరోసాను కూడా ఎత్తగొట్టడం వంటి ప్రధానమైన ఆర్థిక సమస్యలు రైతు ఆత్మహత్యలకు దారితీస్తున్న విషయం తమ దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. వ్యవసాయ రంగానికి ఉచిత విద్యుత్తు సరఫరా, సకాలంలో సాగునీటి వసతి కల్పించే విషయంలో సరారు పూర్తిగా చేతులెత్తేయడంతోనే రైతులు తీవ్ర సంక్షోభంలో కురుకుపోతున్నాని ఆవేదన చెందారు. కాంగ్రెస్ అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాల వల్లే రాష్ట్ర వ్యవసాయ రంగం పూర్తిగా చిన్నాభిన్నమైందని విమర్శించారు. రైతులు, వ్యవసాయ రంగాన్ని పట్టించుకోకుండా దికులు చూస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి దిశానిర్దేశం చేసేలా ప్రధాన ప్రతిపక్షంగా తమ వంతు పాత్ర పోషించాలనే సదుద్దేశంతోనే ఈ అధ్యయన కమిటీని ఏర్పాటు చేసినట్టు కేటీఆర్ తెలిపారు. పదేండ్ల పాటు రైతును రాజును చేసే లక్ష్యంతో పనిచేసిన బీఆర్ఎస్ పార్టీ ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న పరిస్థితులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నదని తెలిపారు. విస్తృత పర్యటనలు, అధ్యయనం తర్వాత పార్టీ తరఫున రూపొందించే ఈ నివేదిక ప్రభుత్వానికి అందజేసి రానున్న బడ్జెట్ సమావేశాల్లో రైతుల సమస్యలపై వారికి ఇచ్చిన హామీల అమలుపై, రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీస్తామని పేర్కొన్నారు.

# చిత్ర నిర్మాతల ఇళ్లపై ఐటి దాడులు

## దిల్ రాజు, మైత్రీ మూవీ మేకర్స్ ఇళ్లు కార్యాలయాల్లో సోదాలు

మొదటిపేజీ తరువాయి

ఏకకాలంలో 8 చోట్ల 55 బృందాలతో తనిఖీలు చేపట్టారు. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్‌లో దిల్ రాజు ఇళ్లతో పాటు ఆయన సోదరుడు శిరీశ్, కుమార్తె హన్సితరెడ్డి నివాసాల్లోనూ ఐటీ అధికారులు సోదాలు చేపట్టారు. దిల్ రాజు సతీమణి వైగారెడ్డిని కారులో తీసుకెళ్లారు. బ్యాంక్ లాకర్లను పరిశీలించి అనంతరం ఇంటికి తీసుకువచ్చారు. వ్యాపార భాగస్వాముల నివాసాల్లోనూ తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన వివిధ పత్రాలను అధికారులు పరిశీలిస్తున్నారు. బ్యాంక్ లాకర్లు ఓపెన్ చేయడానికి ఆదాయపుపన్ను అధికారులు తనను తీసుకెళ్లినట్లు దిల్ రాజ్ భార్య తెలిపారు. 'ఉదయం నుంచి ఐటీ శాఖ అధికారులు సోదాలు చేస్తున్నారు. సినిమాలకు సంబంధించి తనిఖీలు చేస్తున్నారు. ఇవి సాధారణంగా జరిగే సోదాలు మాత్రమే. ఐటీ శాఖ అధికారులు బ్యాంకు వివరాలు కావాలని అడిగారు. బ్యాంకు లాకర్స్ ఓపెన్ చేసి చూపించాం' అని ఆమె తెలిపారు. హైదరాబాద్ లో తెల్లవారుజాము నుండి ఐటి అధికారులు దాడులు నిర్వహించారు. మొత్తం 200 మంది అధికారులు ఈ దాడుల్లో పాల్గొన్నట్టు సమాచారం. ఇటీవల సంక్రాంతికి విడుదలైన రెండు స్టార్ హీరోల సినిమాలు నిర్మించిన సినీ నిర్మాత నివాసంతో పాటు, ఆఫీసు, కుటుంబసభ్యుల ఇళ్లలో సోదాలు నిర్వహిస్తున్నారు. అలాగే ప్రముఖ ఆ నిర్మాత సోదరుడు, కుమార్తె నివాసంలో కూడా ఐటీ సోదాలు చేస్తున్నారు. మరోవైపు గతేడాది చివర్లో పాన్ ఇండియా స్థాయిలో రిలీజ్ అయి ఇండియా బిగ్గెస్ట్ హిట్ సాధించిన చిత్ర నిర్మాత ఆఫీసుల్లో కూడా తనిఖీలు చేస్తున్నారు. ఆ చిత్ర నిర్మాణ సంస్థల్లో కీలకమైన ముగ్గురు ఇళ్లలోను ఐటి అధికారులు ఈ తెల్లవారు జామున నుండి సోదాలు చేస్తున్నారు. చిత్ర నిర్మాణానికి చెందిన లావాదేవీలు, కలెక్షన్స్ తదితర వివరాలపై అరా తెస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి. ఈ ఇద్దరి నిర్మాతలతో పాటు టాలీవుడ్ కు చెందిన ప్రముఖ మ్యూజిక్ లేబుల్ కంపెనీకి చేసిన అధినేత ఇంట్లో అలాగే ఆఫీసులో రైడ్స్ జరుగుతున్నట్టు తెలుస్తోంది. సుమారు మూడు గంటల నుండి ఈ రైడ్స్ జరుగుతున్నట్టు సమాచారం.

# కొనసాగుతున్న ఎన్‌కౌంటర్

## 16కు చేరిన నక్సల్స్ మృతుల సంఖ్య

మొదటిపేజీ తరువాయి

అయితే సోమవారం రాత్రి, మంగళవారం తెల్లవారుజామున .. మెయిన్‌పుర్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 14 మంది మృతిచెందారు. దీంతో నక్సల్స్ మృతుల సంఖ్య 16కు చేరినట్లు పోలీసులు వెల్లడించారు. మృతుల్లో మావోయిస్టు సెంట్రల్ కమిటీ నేత జయరాం అలియాస్ చలపతి కూడా ఉన్నారు. అతడిపై కోటి రూపాయల నజరానా ఉన్నట్లు గరియాబంద్ ఎస్పీ నిఖిల్ రకీచా తెలిపారు. ఎన్‌కౌంటర్‌లో ప్రాణాలు కోల్పోయిన నక్సల్స్ మృతదేహాలను గుర్తిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం రాష్ట్ర సరిహద్దుల్లో ఇంకా ఎదురుకాల్పులు కొనసాగుతున్నాయని, మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు ఆయన తెలిపారు. ఇంటెలిజెన్స్ సమాచారం ఆధారంగా జనవరి 19వ తేదీన కులరీఘాట్ రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతంలో సెర్చ్ ఆపరేషన్ మొదలైందన్నారు. సోమవారం జరిగిన ఎన్‌కౌంటర్ ప్రదేశం నుంచి భారీ స్థాయిలో ఫైర్‌ఆర్మ్స్, అమ్మ్యూనిషన్, ఐఈడీలు, సెల్ఫ్ లోడింగ్ రైఫిళ్లు రికవరీ చేసినట్లు చెప్పారు. ఇక ఇప్పటి వరకు ఈ ఏడాది ఛత్తీస్‌గఢ్‌లో 40 మంది నక్స్ మృతిచెందారు. గత ఏడాది భద్రతా దళాలు వేర్వేరు ఘటనల్లో 219 మంది నక్సల్స్‌ను హతమార్చాయి.

# దావోస్‌లో తెలంగాణ పెట్టుబడుల వేట

మొదటిపేజీ తరువాయి

దాంతోపాటు.. పలు సంస్థలతో పెట్టుబడులపై సంప్రదింపులు జరుపుతారు. దావోస్‌లో జరగనున్న డబ్ల్యూఈఎఫ్ సందర్భంగా ప్రవాస భారతీయులతో భేటీకానున్నారు. గత ఏడాదితో పోలిస్తే.. ఈసారి మరిన్ని పెట్టుబడులను ఆకర్షించేలా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రణాళికలను రూపొందించినట్లు తెలుస్తోంది. ప్రపంచ ఆర్థిక వేదిక శిఖరాగ్ర సదస్సులో భాగంగా దావోస్‌లో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బృందం.. అక్కడ తెలంగాణ పెవిలియన్‌ను ప్రారంభించింది. ఈ సందర్భంగా కేంద్ర మంత్రులు చిరాగ్ పాశ్వాన్, జయంత్ చౌదరీలతో రేవంత్ బృందం సమావేశమైంది. రాష్ట్రానికి చెందిన పలు ప్రాజెక్టులపై కేంద్ర మంత్రులతో చర్చించింది. మరోవైపు దావోస్‌లో పలు అంతర్జాతీయ సీఈవోలతో సీఎం రేవంత్ రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు భేటీ కానున్నారు.

# పోలీస్ పహారా మధ్య గ్రామసభలు

మొదటిపేజీ తరువాయి

ఊరూరా తిరగబడుతున్న జనం, ఎక్కడిక్కడ నిలదీస్తున్న ప్రజానీకాన్ని చూస్తే కాంగ్రెస్ ఏడాది పాలన పెద్ద ఫెయిల్యూర్ అని అర్థమవుతున్నదని హరీశ్‌రావు అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి విదేశాల్లో, మంత్రులందరూ పక్క రాష్ట్రాల్లో బిజీగా ఉంటే ప్రజలను ఎవరు పట్టించుకోవాలని ప్రశ్నించారు. ఇందిరమ్మ రాజ్యంలో పోలీసు పహారా నడుమ గ్రామ సభలు నిర్వహించాల్సిన దుస్థితి రావడం దారుణమని అన్నారు. పథకాల లబ్దిదారుల ఎంపిక కోసం ప్రభుత్వం ఒకవైపు గ్రామ సభలు నిర్వహిస్తుంటే, మరోవైపు కార్యకర్తలకే పథకాలు ఇస్తామని అధికార పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులు చెప్పడం సిగ్గుచేటు అని విమర్శించారు. అలాంటపుడు గ్రామ సభలు తూతూ మంత్రంగా నిర్వహిస్తున్నట్లేనా? అర్హులైన వారికి పథకాలు ఎగ్గొడుతున్నట్లేనా? అని నిలదీశారు.ఎన్నికల ముందు హామీలిస్తం.. అధికారంలోకి వచ్చాక ఎగ్గొడుతం అన్నట్లుగా వ్యవహరిస్తే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని కాంగ్రెస్‌ను హరీశ్‌రావు హెచ్చరించారు. రుణమాఫీ, రైతు భరోసా, పంట బోనస్, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు.. అర్హులైన అందరికీ ఇస్తామని చెప్పి ఇప్పుడు భారీ కోతలు విధిస్తే ప్రజలు తిరగబడకుండా ఏం చేస్తారని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకుల పాపం, అధికారులకు శాపంగా మారిందని.. ప్రజలకు సమాధానం చెప్పలేని పరిస్థితి నెలకొందని విమర్శించారు.మీరు నిర్వహిస్తున్న గ్రామ సభలు దగా.. ఆరు గ్యారెంటీలు అమలు దగా.. రుణమాఫీ చేయడం దగా.. పంట బోనస్ ఇవ్వడం దగా.. రైతు భరోసా అమలు దగా.. రేషన్ కార్డుల జారీ దగా.. ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక దగా అని హరీశ్‌రావు మండిపడ్డారు. ఏడాది కాలంలో మీరు చేసిన దగాను ప్రజలు అర్థం చేసుకున్నారని అన్నారు. మీరు చేసిన మోసాన్ని, నయవంచనను ప్రజలు తెలుసుకున్నారని తెలిపారు. ప్రశ్నించే ప్రతిపక్షాలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని, అరెస్టులు చేసి నోళ్లు మూయిస్తున్నారని ధ్వజమెత్తారు. నేడు యావత్ తెలంగాణ ఏకమై మీ దుర్మార్గ పాలనను నిలదీస్తున్నదని.. అడుగడుగునా ప్రశ్నిస్తున్నదని అన్నారు. మరి ఇప్పుడు వారిపై ఎన్ని కేసులు పెడతరు.. ఎంత మందిని అరెస్టులు చేస్తరని నిలదీశారు.

# పదేళ్లల్లో ఒక్కరేషన్ కార్డయినా ఇచ్చారా

మొదటిపేజీ తరువాయి

ఇప్పటికే ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందిస్తున్నాం,200 యూనిట్ల ఉచిత విద్యుత్,500 కి గ్యాస్ ఆరోగ్య శ్రీ నీ 5-10 లక్షలకు పెంచుకున్నామని ఆయన తెలిపారు. రైతులకు 2 లక్షల లోపు రైతు రుణమాఫీ చేశామని, ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలోనే 55 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని, సన్న వడ్ల కు 500 బోనస్ ఇచ్చాం.. గతంలో ఎప్పుడు లేని విధంగా ధాన్యం సేకరణ చేసిన 48 గంటల్లోపు రైతుల ఖాతాలో డబ్బులు జమ చేశామని ఆయన పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్న ఇప్పటికే అమలు చేస్తున్న పథకాల మాదిరి ఈనెల లోనే మరో 4 పథకాలు ప్రారంభం కానున్నాయని, ప్రజలు ఎవరు అధైర్యపడవద్దు.. అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు వర్తిస్తాయన్నారు మంత్రి పొన్నం ప్రభాకర్. గ్రామాల్లో నేటి నుండి గ్రామ సభలు జరుగుతుండడంతో ఎవరికైనా అర్హత ఉండి రేషన్ కార్డు , ఇందిరమ్మ ఇళ్లు లబ్దిదారుల ఉంటే అధికారులకు మీ పూర్తి సమాచారాన్ని ఇవ్వాలి అని, కింది స్థాయిలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు రేషన్ కార్డుల , ఇందిరమ్మ ఇళ్ల పై జరుగుతున్న తప్పుడు సమాచారం పై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. వారికి కాంగ్రెస్ క్యాడర్ అండగా నిలబడాలన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు అందజేస్తాం... కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్



కబురు న్యూస్ బాన్సువాడ జనవరి 21



అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు అందజేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్ అన్నారు. మంగళవారం బాన్సువాడ మున్సిపల్ పరిధిలో డబుల్ బెడ్ రూమ్ కాలనిలో జరిగిన వార్డు సభలో ఆయన పాల్గొని మాట్లాడుతూ రేషన్ కార్డు కొరకు గ్రామసభలో దరఖాస్తులు చేసుకోవచ్చని, దరఖాస్తు చేసుకుని అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు అందుతాయన్నారు. ఇందిరమ్మ భరోసా, ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లను కూడా అర్హులైన వారికి మాత్రమే వస్తాయని ఎవరు ఆందోళన చెందవద్దన్నారు.. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కిరణ్మయి తహసిల్దార్ వరప్రసాద్, మైనారిటీ జిల్లా అధ్యక్షులు ఖలేఖ్ , బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అసద్, నాయకులు గుడాల నగేష్,గొల్ల వెంకన్న యాదవ్, షాహబ్ ,మాజీ వార్డు సభ్యులు దాసరి కాలనీవాసులు రహీస్ జహీర్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## భూమిని సాగు చేసే వారికే రైతు భరోసా వస్తుంది.. ఏడిఏ అరుణ



కబురు న్యూస్ బాన్సువాడ, జనవరి 21

బాన్సువాడ మండలంలోని ఇబ్రహీంపేట్ తండ గ్రామపంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన గ్రామసభలో ఏడిఏ అరుణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సాగుచేసిన భూములను గుర్తించేందుకు సర్వే చేపట్టామని, తండాలో సాగు చేయని భూమి 8 ఎకరాలు మాత్రమే ఉందన్నారు. వీటిపై రైతుల నుండి ఏమైనా అభ్యంతరాలు, సలహాలను దరఖాస్తుల ద్వారా స్వీకరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ వరప్రసాద్, ఎంపీఓ సత్యనారాయణరెడ్డి, పంచాయతీ కార్యదర్శి నవీన్ కుమార్, ఏఈఓ దత్తేశ్వరి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

## అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు అందజేస్తాం.. సబ్ కలెక్టర్

కబురు న్యూస్ బాన్సువాడ, జనవరి 21



బాన్సువాడ మున్సిపల్ పరిధిలోని ఒకటో వార్డులో మంగళవారం ప్రజాపాలన వార్డు సభలో సబ్ కలెక్టర్ కిరణ్మయి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వార్డులో ప్రజల నుండి రేషన్ కార్డు లేని వారి దరఖాస్తులను స్వీకరించాలని, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా పై ప్రజల సలహాలు సూచనలు స్వీకరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. అర్హులైన ప్రతి ఒకరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అమీర్ చావుస్, వార్డు అధికారి, సంబంధిత శాఖల అధికారులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## జక్కల్ దానితండాలో జరుగుతున్న గ్రామసభను పరిశీలించిన అదనపు కలెక్టర్ విక్టర్

– అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు..

కబురు న్యూస్ బాన్సువాడ జనవరి 21



బాన్సువాడ మండలంలోని జక్కల్ దానితాండ గ్రామపంచాయతీ ఆవరణలో ఏర్పాటుచేసిన గ్రామసభను అదనపు కలెక్టర్ విక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజల నుండి వస్తున్న దరఖాస్తు వివరాలను ఆయన తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ కార్డు లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకంగా విచారణ చేపట్టాలని, లబ్ధిదారుల ఎంపికలు ఎలాంటి అవకతవకలు లేకుండా చూసుకునే బాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు అందుతాయని ప్రజలు ఆందోళన చెందవద్దన్నారు. ఇందిరమ్మ భరోసా, ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లపై దరఖాస్తులను తీసుకోవాలని, ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులను దరఖాస్తులను స్వీకరించి ఉన్నత అధికారులకు నివేదిక అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, అధికారి ముజీబ్, ఆర్ఐ అశోక్, పంచాయతీ కార్యదర్శులు పండరి, రహెల బేగం, గీత, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన వారికి రేషన్ కార్డులు అందజేస్తాం.... తహసిల్దార్ వరప్రసాద్

కబురు న్యూస్ బాన్సువాడ జనవరి 21





రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులైన వారిని గుర్తించి సంక్షేమ పథకాలను అందజేయడమే ప్రభుత్వ లక్ష్యమని తహసిల్దార్ వరప్రసాదరావు అన్నారు. మంగళవారం బాన్సువాడ మండలంలోని ఇబ్రహీంపేట్ తండాలో ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా చేపట్టిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. గ్రామ సభలో పంచాయతీ కార్యదర్శి రేషన్ కార్డులు వచ్చిన వారి జాబితాను చదివి వినిపించారు. అభ్యంతరాలు ఉన్నట్లయితే గ్రామ సభలో తెలియజేయాలని తెలిపారు. ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ భరోసా, ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి ఉన్నత అధికారులకు నివేదిక అందిస్తామన్నారు. రేషన్ కార్డులు రానివారు ఆందోళన చెందవద్దన్నారు. ప్రభుత్వం గ్రామ సభలు ఏర్పాటు చేసి ప్రజల సమస్యలను తెలుసుకోవడం పట్ల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిఈవో రాజు, తహసిల్దార్ వరప్రసాద్,ఎంపీఓ సత్యనారాయణరెడ్డి, ఏడిఏ అరుణ,ఏపీవో గంగాధర్, పంచాయతీ కార్యదర్శులు నవీన్ కుమార్, నవీన్ గౌడ్, షాబుద్దీన్, ఏఈఓ దత్తేశ్వరి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# పసుపు బోర్డు ఏర్పాటులో ఎమ్మెల్సీ కవిత కృషి ఎనలేనిది

కబురు న్యూస్,నిజామాబాద్,జనవరి 21:



పసుపు బోర్డు ఏర్పాటులో ఎమ్మెల్సీ కవిత కృషి ఎవరు కాదనలేని సత్యమని నగర మేయర్ దండు నీతూ కిరణ్ అన్నారు.నగరంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఆమె మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎమ్మెల్సీ కవిత పసుపు బోర్డు ఏర్పాటు స్వాగతిస్తునామని తెలిపి పసుపు పంటకు మద్దతు ధర,పసుపు దిగుమతులను కట్టడి చేసే విధంగా కృషి చేయాలని చేసి సూచనను,పసుపు బోర్డు ఏర్పాటుకు తాను చేసిన కృషిని చెప్పుకుంటే మీకు వచ్చిన నష్టమేంటని ప్రశ్నించారు. కొద్ది మంది నాయకులు వారి స్థాయి మరచి పెద్ద నాయకులను విమర్శిస్తే పెద్దవాళ్లం అవుతామని భ్రమ పడుతున్నారని అన్నారు. ఎమ్మెల్సీ కవిత పసుపు బోర్డు ఏర్పాటుకు ఎన్నో సార్లు ప్రధాన మంత్రిని,5 రాష్ట్రాల ముఖ్యమంత్రులను కలిసి వినతులు అందించారని పార్లమెంట్ లో ప్రైవేట్ బిల్లు ప్రవేశపెట్టిన పసుపు బోర్డు అంశాన్ని పార్లమెంట్ వేదికగా ప్రశ్నించారన్న విషయాన్ని తెలుసుకోవాలని సూచించారు. పసుపు రైతుల సమస్యలపై చేసిన పోరాటానికి పార్లమెంట్ వేదికగా లేవనేత్తిన అంశాలకు గాను ఉత్తమ పార్లమెంటరియన్ అవార్డు సైతం ఈ కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన విషయాన్నీ తెలుసుకొని మాట్లాడాలని హితవు పలికారు. ఎమ్మెల్సీ కవిత పై అవాకులు చేవాకులు మాట్లాడితే తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు. ఎవరో చెపితే ప్రెస్ మీట్ పెట్టిన నాయకులు మీ ఎంపీ అరవింద్ ని పసుపు బోర్డు గొప్పదా లేక టర్మారిక్ ఎక్సటెన్షన్ సెంటర్ గొప్పదో ప్రశించాలని కోరారు. పసుపు బోర్డు ఏర్పాటుకు ఎమ్మెల్సీ కవిత ఎనలేని కృషి చేసారని,ప్రస్తుత ఎంపీ అరవింద్ 5 రోజుల్లో తెస్తానన్నా పసుపు బోర్డు కు 5సంవత్సరాల కాలయాపన తరువాత రాజకీయ లబ్ది కోసమే బోర్డు ప్రకటన చేసారని ఎందుకు బహిరంగ ప్రారంభ వేడుకలు నిర్వహించలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పి వైస్ ఛైర్మెన్ సుమన రెడ్డి,మాజీ కార్పొరేటర్లు విశాలిని రెడ్డి,సిర్ప సువర్ణ,పార్టీ కార్మిక విభాగం ఆధ్యక్షురాలు విజయలక్ష్మి,పార్టీ నగర మహిళా ఆధ్యక్షురాలు గంగామణి,నాయకులు పంచరెడ్డి అనిత పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన...







కబురు న్యూస్, బోధన్ జనవరి 21..

బోధన్ పట్టణంలోని శ్రీ విజయసాయి ఉన్నత పాఠశాలలో ట్రాఫిక్ భద్రత మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం బోధన్ ఎస్.హెచ్.ఓ వెంకటనారాయణ మాట్లాడుతూ విద్యార్థిని, విద్యార్థులకు 18ఏళ్ళు దాటిన తర్వాత మాత్రమే టూ వీలర్స్, ఫోర్ వీలర్ నడిపే విధంగా చట్టం ఉందని తెలిపారు. చట్ట పరిధిలోనే ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చిన్నారుల మీద వారి తల్లిదండ్రుల పైన కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ఒకసారి కేసు నమోదు చేసిన తర్వాత విద్యార్థులకు భవిష్యత్తులో వచ్చే ఇబ్బందులను ఆయన వివరించారు. బోధన్ ఎం.వి.ఐ శ్రీనివాస్ మాట్లాడుతూ మనకు ట్రాఫిక్ ఎవర్నెస్ అనేది జీవితంలో ఒక భాగమని



ప్రతినిత్యం అప్రమత్తతగా ఉండాలని కారులో ప్రయాణించేటప్పుడు సీట్ బెల్టులు, టూవీలర్ పై ప్రయాణించేటప్పుడు హెల్మెట్, పాదచారులుగా నడిచేటప్పుడు అప్రమత్తతతో ఉండటానికి కావలసిన జాగ్రత్తలను ఆయన వివరించారు. బోధన్ మండల ఎడ్యుకేషనల్ ఆఫీసర్ నాగయ్య మాట్లాడుతూ మీ తల్లిదండ్రులను మీరు ఇబ్బంది పెట్టి వెహికల్స్ తీసుకొని వారికి మనసు బాధపడేటట్టు చేయవద్దని ఇప్పటివరకు ఎవరికైతే వెహికిల్స్ మీద వస్తున్నారో, వారు రేపటి నుంచి వేరే ఏర్పాట్లు చేసుకోవాల్సిందిగా ఆయన విద్యార్థులను సూచించారు. మనకు తెలియకుండా జరిగే ప్రమాదాలను మనము ఆపేటట్లుగా పరిసరాలను గమనించుకుంటూ నడవవలసి ఉంటుందని విద్యార్థులే రేపటి భవిష్యత్తు తరాలకు నాయకులని విద్యార్థుల మీద భారత దేశ భవిష్యత్తు ఆధారపడి ఉందని మీరు చేసే చిన్న చిన్న తప్పిదాల వలన మీ తల్లిదండ్రులకు ఇబ్బంది కలగ చేయకుండా ఉండాలని ఆయన కోరారు. ప్రిన్సిపాల్ కృష్ణమోహన్ మాట్లాడుతూ ముఖ్యంగా పదో తరగతి పిల్లలకు రానున్న ఎస్ఎస్సి ఎగ్జామినేషన్స్ దృష్టిలో పెట్టుకుని తల్లిదండ్రులకు విద్యార్థులకు పిల్లవాడు బయలుదేరటానికి స్కూలు సమయము కంటే కనీసం 20 నుంచి 25 నిమిషాలు ముందు వచ్చేటట్లుగా ప్లాన్ చేసుకోవాలని దాని వలన ఏ రకమైన ఇబ్బంది కలగకుండా ఉంటుందని ఆయన తెలుపుతూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

# సంక్షేమ పథకాల అమలు నిరంతర ప్రక్రియ

– లోలం గ్రామసభలో కలెక్టర్ స్పష్టీకరణ...

కబురు న్యూస్,నిజామాబాద్,జనవరి 21 :



సంక్షేమ పథకాలు అమలు నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు స్పష్టం చేశారు. ఇందల్వాయి మండలం లోలం గ్రామంలో మంగళవారం నిర్వహించిన ప్రజా పాలన గ్రామసభలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ నెల 26 నుండి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఆహార భద్రత (రేషన్) కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల గురించి గ్రామస్తులకు వివరించారు. ఈ పథకాల కింద అర్హులను గుర్తించేందుకు వీలుగా క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించడం జరిగిందని కలెక్టర్ గుర్తు చేశారు. ముఖ్యంగా సాగుకు యోగ్యమైన భూములను పక్కాగా నిర్ధారించామని అన్నారు. పంటలు సాగు చేస్తున్న ప్రతి రైతుకు ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద ఎకరానికి 12 వేల రూపాయల చొప్పున పెట్టుబడి సాయం అందిస్తుందని తెలిపారు. అదేవిధంగా సాగు భూమి లేని వ్యవసాయ కూలీ కుటుంబాలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద రెండు విడతల్లో సాలీనా 12 వేల రూపాయలు అందించడం జరుగుతుందన్నారు. ఎలాంటి సాగు భూమి లేకుండా, 2023-24 ఆర్థిక సంవత్సరంలో కనీసం 20 రోజులు పని చేసిన కుటుంబాలను అర్హులుగా గుర్తించామన్నారు. కొత్త రేషన్ కార్డుల కోసం వచ్చిన దరఖాస్తులను సమగ్ర పరిశీలన జరిపి, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అర్హులను నిర్ధారించామని తెలిపారు. ఈ మేరకు వివిధ పథకాల ద్వారా అర్హులుగా గుర్తించబడిన వారి వివరాలను గ్రామ సభలో అందరి సమక్షంలో చదివి వినిపించారు. ఎలాంటి అభ్యంతరాలు లేకుండా గ్రామ సభ వీటికి ఆమోదం తెలిపింది.ఆయా పథకాల కింద ఇప్పటివరకు దరఖాస్తులు చేసుకోని వారితో పాటు, అర్హత కలిగి లబ్ధిదారుల జాబితాలో పేర్లు లేని వారి నుండి కూడా అర్జీలు స్వీకరించారు.రేషన్ కార్డుల జారీ,ఇందిరమ్మ ఆత్మీయ భరోసా తదితర పథకాల కోసం అర్హత కలిగిన వారు ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. వాటిని సమగ్రంగా పరిశీలించి, అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చడం జరుగుతుందని తెలిపారు.ఈ విషయంలో ప్రజలు ఎలాంటి అపోహలు,అనవసర ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని అన్నారు.గ్రామ సభలలో దరఖాస్తులు అందజేయవచ్చని,వీలుపడని వారు ఈ నెల 26 తరువాత ఎప్పుడైనా మండల కార్యాలయాలలోని ప్రజా పాలన సేవా కేంద్రాలకు వెళ్లి సంబంధిత పత్రాలను జాతచేస్తూ దరఖాస్తులు చేసుకోవచ్చని సూచించారు.వచ్చిన ప్రతి దరఖాస్తును తప్పనిసరిగా పరిశీలించి,అర్హులందరికీ సంక్షేమ పథకాలను వర్తింపజేస్తామని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు భరోసా కల్పించారు.గ్రామ సభలో నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్,మండల ప్రత్యేక అధికారి వీరాస్వామి,స్థానిక అధికారులు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

15

1555

# గత ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని విస్మరించింది... కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి



**కబురు న్యూస్ హైదరాబాద్, జనవరి 21**

గత తొమ్మిదేళ్ల పాలనలో బిఆర్ఎస్ ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని విస్మరించి వ్యవసాయ రంగాన్ని అతలాకుతులం చేసిందని రాష్ట్ర రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి అన్నారు. మంగళవారం రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులకు గత ప్రభుత్వం తమ భూమిపై హక్కు లేకుండా ధరణి అనే వ్యవస్థను తీసుకువచ్చి వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసిందన్నారు. వ్యవసాయ కూలీలతో పాటు రైతుల సమస్యలను పరిష్కరించడంలో గత ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం అనునిత్యం కృషి చేస్తుందన్నారు.ఈ సమావేశంలో రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్, సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి, సహకార యూనియన్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, ర్యాల నాగేశ్వరరావు నరసింహారెడ్డి, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సీపీ సింధూ శర్మ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్న పోలీస్ కానిస్టేబుల్...




**కబురు న్యూస్,బోధన్ జనవరి 21..**
నిజామాబాద్ జిల్లా ఇంచార్జి పోలీస్ కమీషనర్ సింధూ శర్మ చేతుల మీదుగా బోధన్ పట్టణ పోలీస్ కానిస్టేబుల్ మాన్సింగ్ ప్రశంసాపత్రం అందుకున్నారు. బోధన్ పట్టణ ఠాణా పరిధిలోని బాధితులు పోగొట్టుకొన్న మొబైల్ ఫోన్లను సిఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి 38 ఫోన్లు రికవరీ చేసి నిజామాబాద్ జిల్లాలోనే రెండవ స్థానం పొందిన సందర్భంగా జిల్లా ఇంచార్జి కమీషనర్ సింధూ శర్మ చేతుల మీదుగా మంగళవారం పోర్టల్ భాద్యుడు కానిస్టేబుల్ మాన్సింగ్ కు నిజామాబాద్ నగరంలోని సీపీ కార్యాలయంలో ప్రశంసాపత్రం అందించి అభినందించినట్లు పట్టణ సిఐ వెంకటనారాయణ తెలిపారు.

# కౌమార దశపై విద్యార్థులకు అవగాహన...


**కబురు న్యూస్,బోధన్ జనవరి 21..**



వుమెన్స్ ఆర్గనైజేషన్ ఫర్ రూరల్ డెవలప్మెంట్ ఆధ్వర్యంలో బోధన్ మండలంలోని పెగడాపల్లి, పెంటాకలాన్, కల్దుర్కి గ్రామాలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు చెందిన 8,9,10వ తరగతి విద్యార్థిని, విద్యార్థులకు వర్డ్ స్వచ్ఛంద సంస్థ కమ్యూనిటీ కో ఆర్డినేటర్లు చంద్రశేఖర్, రజతలు కౌమార దశ గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం విద్యార్థులకు చేపట్టిన అవగాహన కార్యక్రమంలో కౌమారదశలో వచ్చే మార్పుల గురించి, వ్యక్తిగత పరిశుభ్రత, లైంగిక ఆరోగ్యం, రుతుచక్రం, లైంగిక వ్యాధులు, రక్తహీనత, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, బాల బాలికల రక్షణ, పోక్సో చట్టాల గురించి అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలుగా నిలిచిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యయుల చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పెంటాఖుర్ద జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయులు అబ్బయ్య, ఉపాధ్యయబృందం ఉదయ భాస్కర్, వరలక్ష్మి, జగదీష్, మైసయ్య, రవికుమార్, శివానంద్ రావు, ప్రవీణ్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమం ఫలాలు...

**కబురు న్యూస్ బాన్సువాడ, జనవరి 21**




బాన్సువాడ మున్సిపల్ పరిధిలోని నాలుగో వార్డ్ లో మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రజా పాలన వార్డు సభ నిర్వహించగా వార్డు అధికారులు ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా వార్డు కౌన్సిలర్ రుక్మిణి, కాంగ్రెస్ నాయకులు లయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో పేద బడుగు బలహీన వర్గాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రేషన్ కార్డులో రానివారు వార్డు సభలో దరఖాస్తులు అందజేసినట్లయితే అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు అధికారి షాదుల్లా, రెవెన్యూ సిబ్బంది అలీ, కాలనీవాసులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# మార్ఫింగ్ ఫోటోలు పోస్ట్ చేయడం దిగజారుడు రాజకీయానికి నిదర్శనం

**– నగర మేయర్ నీతూ కిరణ్...**




**కబురు న్యూస్,నిజామాబాద్,జనవరి 21:**
మహిళ ప్రజాప్రతినిధి పై మార్ఫింగ్ ఫోటోలు పోస్ట్ చేయటం దిగజారుడు రాజకీయానికి నిదర్శనమని నగర మేయర్ నీతూ కిరణ్ అన్నారు.సామజిక మాద్యమాల ద్వారా ఎమ్మెల్సీ కవిత మార్ఫింగ్ ఫోటోలను ఏఅరవింద్ ధర్మపురి ఆర్మీ అనే ఐడి తో పోస్ట్ పెట్టినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని,వెంటనే సామాజిక మధ్యమాల నుండి ఆ పోస్టులను తొలగించాలని ఇంచార్జి కమిషనర్ అఫ్ పోలీస్ సింధూశర్మను మంగళవారం కలిసి పిర్యాదు చేశారు.ఈ సందర్బంగా మేయర్ మాట్లాడుతూ ఎంపీ అరవింద్ ధర్మపురి అనుచరులు విచ్చలవిడిగా కనీసం మహిళల ప్రజా ప్రతినిధి అనే గౌరవం లేకుండా మార్ఫింగ్ ఫోటోతో కించపరచటం సిగ్గు చేటని అన్నారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నగర అధ్యక్షులు సిర్ప రాజు,మాజీ కార్పొరేటర్ విశాలిని రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సెల్ ఫోన్ల వాడకంలో అప్రమత్తంగా ఉండాలి




**– అదనపు పోలీస్ కమిషనర్ (అడ్మిన్) బస్వారెడ్డి**

**కబురు న్యూస్,నిజామాబాద్ జనవరి 21 :**
సెల్ ఫోన్ల వాడకంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని అదనపు పోలీస్ కమిషనర్ (అడ్మిన్) బస్వారెడ్డి సూచించారు.ఈ మధ్య కాలంలో నిజామాబాద్,ఆర్మూర్,బోధన్ డివిజన్ పరిధిలో పోగొట్టుకున్న71 సెల్ ఫోన్లను బాధితులకు మంగళవారం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.సీఈఐఆర్ పోర్టల్ ద్వారా 71 సెల్ ఫోన్లను రికవరీ చేసినట్లు తెలిపారు.సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఎవ్వరైనా వారి సెల్ ఫోన్ పోయినట్లయితే సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్ నంబర్ ను వెబ్ సైటు లోకి వెళ్లి అందులో పూర్తి వివరాలు పొందవర్చాలని సూచించారు.అలా చేసినట్లయితే త్వరగా వారి సెల్ ఫోన్ ను పట్టుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రజలు ఈ పద్దతిని సద్వినియోగపర్చుకోవాలని తెలిపారు.

# గార్మెంట్స్ షాపులో చోరి

**కబురు న్యూస్,నిజామాబాద్,జనవరి 21 :**




నిజామాబాద్ నగరంలో దొంగలు రెచ్చిపోయారు.నగరంలోని జవహర్ రోడ్డు( పూసలగల్లి)లో చోరికి పాల్పడ్డారు. సోమవారం రాత్రి జేడి గార్మెంట్స్ షాపు షట్టర్లను రాడ్లతో లేపి చోరికి పాల్పడ్డారు.రెడిమేడ్ బట్టలతో పాటు సెల్ పోన్ చోరికి పాల్పడినట్లు తెలిసింది.మంగళవారం ఉదయం ఈ విషయం వెలుగు చూసింది.షాప్ యజామాని జావీద్ పిర్యాదు మేరకు 1వ టౌన్ పొలీసులు కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నారు.

# విద్యార్థి ఆత్మహత్య

**కబురు న్యూస్,నిజామాబాద్,జనవరి 21 :**



పాఠశాలకు వెళ్లాలని తల్లిదండ్రులు మందలించడంతో పాఠశాల విద్యార్థి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు.ఈ సంఘటన మంగళవారం ఉదయం నిజామాబాద్ లోని మహలక్ష్మినగర్ లో జరిగింది. స్థానికంగా మహలక్ష్మి నగర్ లో నివాసం ఉండే ప్రభుత్వ ఉపాధ్యాయురాలు నవిత దంపతులకు దామేర సాక్షిత్ రెడ్డి (14) తో పాటు మరో కొడుకు ఉన్నారు.భర్త,పెద్ధ కొడుకు హైదరాబాద్ లో ఉండగా నవిత చిన్నకొడుకుతో కలిసి మహలక్ష్మి నగర్ లో నివాసం ఉంటుంది. సాక్షిత్ రెడ్డి వాసవి స్కూల్ లో 8 వ తరగతి చదువుతున్నారు.మహలక్ష్మి టిజిటి ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నారు.స్కూల్ చదువులో వెనకబడినంధుకు సాక్షిత్ రెడ్డిని తల్లి సోమవారం మందలించింది.మంగళవారం ఉదయం తల్లి నమిత విధులకు వెళ్లకముందుకు స్కూల్ కు వెళ్లి మంచిగా చదువుకో అని చెప్పింది.ఉదయం తోమ్మిది గంటల ప్రాంతంలో స్కూల్ నుంచి సాక్షిత్ రెడ్డి స్కూల్ కు రాలేదని పోన్ లో సమాచారం అందింది.ఈ విషయంలో ఇంటికి పోన్ చేయగా స్పంధన లేకపోవడంతో తల్లి నమిత తిరిగి ఇంటికి రాగా సాక్షిత్ రెడ్డి చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసింది.ఈ మేరకు నాల్గవ టౌన్ పోలిసులు కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నారు.

# లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే



**కబురు న్యూస్, డోంగ్లి జనవరి, 21**

డోంగ్లి మండలంలోని ధోతి గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన గ్రామసభలో ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు పాల్గొని ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. రేషన్ కార్డు లేని వారు గ్రామసభలో సంబంధిత అధికారులకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అనంతరం కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖ అధికారులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ కార్డుల దరఖాస్తు నిరంతర ప్రక్రియ... జిల్లా కలెక్టర్



**– సాగుకు యోగ్యమైన భూములకే రైతు భరోసా....**

**కబురు న్యూస్ కామారెడ్డి,21**






రేషన్ కార్డుల దరఖాస్తు నిరంతర ప్రక్రియ అని, ప్రజలు ఎలాంటి రేషన్ కార్డుల పై ఎలాంటి ఆందోళన చెందవద్దని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. మంగళవారం బిక్నూరు, దోమకొండ మండలాల్లోని భాగ్యర్తి పల్లి లింగుపల్లి గ్రామాల్లో నిర్వహించిన గ్రామ సభలో జిల్లా కలెక్టర్ పాల్గొని గ్రామసభలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగుకు యోగ్యంగా ఉన్న భూములకే మాత్రమే రైతు భరోసా ఇవ్వడం జరుగుతుందని, సాగుకు యోగింగా లేని భూముల వివరాలను గ్రామసభలో తెలియజేయాలన్నారు. భూమిలేని పేదలు ఉపాధి హామీ జాబ్ కార్డు కలిగి ఉండి గత సంవత్సరం కనీసం 20 రోజుల పని చేసిన వారికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లబ్ధి కలుగుతుందన్నారు. నూతన రేషన్ కార్డుల కొరకు గ్రామసభలో దరఖాస్తు చేసుకోవచ్చని ఇది నిరంతర ప్రక్రియ అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరుకు వచ్చిన దరఖాస్తులపై విచారణ జరుగుతుందన్నారు. ఈనెల 26 నుండి ఇందిరమ్మ ఇండ్లు, ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల పంపిణీ, ఇందిరా భరోసా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి లబ్ధి చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిని రజిత, తాసిల్దార్లు శివప్రసాద్, సంజయ్ రావు, జిల్లా అధికారిని జ్యోతి, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, రెవిన్యూ, పంచాయతీ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆశా వర్కర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి.... జే. రవీందర్




**కబురు న్యూస్ కామారెడ్డి, జనవరి 21**

ఆశ వర్కర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం కామారెడ్డి కలెక్టరేట్ కార్యాలయం వరకు చేపట్టిన పాదయాత్రను పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆశ వర్కర్ల యూనియన్ గౌరవ అధ్యక్షులు రవీందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను, మేనిఫెస్టోలో పొందుపరిచిన హామీలను మాత్రమే అమలు చేయాలని కోరుతున్నామన్నారు. ఆశా వర్కర్లకు కనీస వేతనం 18000, ఉద్యోగ భద్రత, ఈఎస్ఐ,పిఎఫ్ కార్డు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్ కార్యాలయంలోని జిల్లా అధికారికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు ఇందిర, రాజశ్రీ, పల్లవి, మంజుల, విజయ, పుష్ప, పద్మ తదితరులు పాల్గొన్నారు.

# నిర్దేశిత ప్రణాళికకు అనుగుణంగా గ్రామ, వార్డు సభలు నిర్వహించాలి

**- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు...**

**కొబ్బరి న్యూస్,నిజామాబాద్ కలెక్టరేట్,జనవరి 21 :**





నిర్దేశిత ప్రణాళికకు అనుగుణంగా ప్రజాపాలన గ్రామ, వార్డు సభలు నిర్వహించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు.
ఈ నెల 24 వరకు కొనసాగనున్న గ్రామ సభల నిర్వహణపై మంగళవారం రాత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, సీతక్కలు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ. శాంతి కుమారితో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. గ్రామ సభల మొదటి రోజైన మంగవారం నాడు రాష్ట్ర వ్యాప్తంగా 4938 గ్రామాలు, మున్సిపల్ వార్డులలో జరిగిన గ్రామ సభలలో ప్రజలు ప్రస్తావించిన అంశాల గురించి కలెక్టర్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా షెడ్యూల్ ప్రకారంగా ప్రజాపాలన సభలు సజావుగా నిర్వహించాలని డిప్యూటీ సీఎం, ఇతర మంత్రులు కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. లబ్ధిదారుల ఎంపిక అనేది నిరంతర ప్రక్రియ అని,
అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ప్రయోజనం చేకూర్చడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జనవరి 26న అమలు చేయనున్న నాలుగు సంక్షేమ పథకాలు (రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు) పథకాలకు ఇప్పటివరకు దరఖాస్తులు చేసుకోని వారి నుండి గ్రామ సభలలో అర్జీలు స్వీకరించాలని సూచించారు. గ్రామ సభల అనంతరం ప్రజాపాలన సేవా కేంద్రాల్లోనూ దరఖాస్తులు చేసుకోవచ్చని ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలన్నారు. ముఖ్యంగా రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలకు సంబంధించి అర్హత కలిగిన చిట్టచివరి కుటుంబానికి సైతం లబ్ధి చేకూర్చాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని, ఈ విషయంలో ఎలాంటి అనుమానాలు, అపోహలకు తావులేదన్నారు. రాష్ట్రంలో ఎంతమంది అర్హులు ఉంటే, అంత మందికి రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు కేటాయించడం జరుగుతుందని స్పష్టం చేశారు. వీ.సీ అనంతరం కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సంబంధిత అధికారులకు టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సూచనలు చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాల అమలును జనవరి 26న ప్రారంభించనున్న నేపథ్యంలో 24 వరకు నిర్వహించే గ్రామ సభలను షెడ్యూల్ వారీగా ఖచ్చితంగా సమయపాలన పాటిస్తూ నిర్వహించాలని, ఎక్కడ కూడా నిర్లక్ష్యానికి తావు లేకుండా అధికారులందరూ అత్యంత జాగ్రత్తగా ఈ ప్రక్రియను సజావుగా నిర్వహించాలని ఆదేశించారు. మొదటి రోజైన మంగళవారం జిల్లాలో 201 గ్రామాలు, వార్డులలో జరిగాయని, ఇదే తరహాలో అన్ని గ్రామాలు, వార్డులలో ప్రణాళికాబద్ధంగా సభలు నిర్వహించాలని సూచించారు. ఆయా పథకాల కింద ఇప్పటివరకు దరఖాస్తులు చేసుకోని వారి నుండి గ్రామ సభలలో అర్జీలు స్వీకరించాలని, వాటిని తప్పనిసరిగా పరిశీలించి అర్హులైన వారికి లబ్ధి చేకూర్చడం జరుగుతుందని స్పష్టంగా తెలియజేయాలన్నారు.లబ్దిదారుల జాబితాను గ్రామ సభల్లో చదివి వినిపించాలని,ఎవరికైనా అభ్యంతరాలుంటే వారి నుండి దరఖాస్తులు స్వీకరించాలన్నారు.ఎలాంటి అపోహలు తలెత్తకుండా ప్రజలకు స్పష్టంగా ప్రభుత్వ ఉద్దేశ్యాన్ని వివరించాలని,సంక్షేమ పథకాల అమలు నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు.గ్రామ సభలలో ఆయా పథకాలకు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించే సమయంలో కుటుంబ యజమాని పేరు,కుటుంబ సభ్యుల పేర్లు, ఆధార్ నెంబర్లు,మొబైల్ నెంబర్,చిరునామా వివరాలు తప్పనిసరి ఉండేలా చూసుకోవాలన్నారు.దీనివల్ల డేటా ఎంట్రీ సమయంలో ఇబ్బందులకు ఆస్కారం ఉండదని కలెక్టర్ సూచించారు.ఇందిరమ్మ ఇళ్ళ కోసం వచ్చిన దరఖాస్తులను,ప్రత్యేకించి అద్దె ఇంట్లో ఉన్నామని దరఖాస్తులు చేసుకున్న వారి అర్జీలను జాగ్రత్తగా పరిశీలించాలన్నారు.గ్రామసభలు నిర్వహించే తప్పనిసరిగా తగిన నీడ తాగునీటి వసతి వంటి మౌలిక సదుపాయాలు తప్పనిసరి ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్లు అంకిత్,కిరణ్ కుమార్,ట్రైనీ కలెక్టర్ అంకిత్,నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పథకాల అమలుపై అపోహలొద్దు...



- అర్హులకే లబ్ధి చేకూరుస్తాం..
- ఎంపిక కాని అర్హుల అర్జీలు స్వీకరణ..
- గ్రామసభ అవరోధానికి బీఆర్ఎస్ నేతల యత్నాలు..
- ప్రతి ప్రశ్నకూ జవాబు చెప్పిన ఎమ్మెల్యే ..
- సందేహాల నివృత్తితో సభ నుంచి జారుకున్న గులాబీలు...

**కబురు న్యూస్,శంకరపట్నం జనవరి 21**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న నాలుగు కొత్త పథకాలపై ఎలాంటి సందేహాలు వద్దని, అర్హులకే పథకాల ద్వారా లబ్ధిచేకూరుస్తామని మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ స్పష్టం చేశారు. మంగళవారం బెజ్జంకి మండలం లక్ష్మీపూర్ లో ఇందిరమ్మ ఇళ్లు, రైతుభరోసా, కొత్త రేషన్కార్డుల పంపిణీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల కోసం లబ్ధిదారు లను గుర్తించేందుకు నిర్వహించిన గ్రామసభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటకు కట్టుబడి ఆరు గ్యారంటీ పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు సమాయత్త మైందన్నారు. ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు, రూ.500 గ్యాస్ సిలిండర్, ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ సాయం రూ.10లక్షలకు పెంపుతోపాటు రైతులకు రుణమాఫీ చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. గణతంత్ర దినోత్సవం రోజున ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను అమలు చేస్తామన్నారు. ఇందిరమ్మ ఇళ్లతో పేదల కల సాకారం.ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలుతో ఇళ్లు లేని నిరుపేదల సొంతింటి కలను సాకారం చేయనున్నామని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి తెలిపారు. గ్రామసభల్లో వెల్లడించే జాబితాల్లో పేర్లు లేని అర్హులైన నిరుపేదలకు మళ్లీ దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందన్నారు. వారి అర్జీలను పున:పరిశీలించి తగు న్యాయం చేస్తామ న్నారు. ఈ పథకంపై పేదలు పెట్టుకున్న ఆశలు వమ్ము చేయమన్నారు. అర్హులైన నిరుపేదలకు తప్పకుండా లబ్ధి చేకూరుస్తామని డాక్టర్ కవ్వంపల్లి హామీ ఇచ్చారు.రైతు కళ్లలో ఆనందం చూసేందుకే రైతు భరోసా రైతు కళ్లలో ఆనందాన్ని చూడాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ ఆకాంక్ష అని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు. అందుకే రైతు భరోసా కింద ఎకరానికి రూ.12 వేల రూపాయల చొప్పు పెట్టుబడి సాయం అందించనున్నా మన్నారు. 26 నుంచి రైతు భరోసా డబ్బులను అర్హులైన రైతుల ఖాతాలో జమ కానున్నాయని ఆయన వెల్లడించారు.కొత్త రేషన్ కార్డుల జారీతో ఏళ్లనాటి నిరీక్షణకు తెర.గత బీఆర్ఎస్ పాలకుల నిర్లక్ష్యానికి గురైన ప్రజాపంపిణీ వ్యవస్థను పటిష్టం చేయడమే కాకుండా కొత్త రేషన్ కార్డుల పంపిణీతో ఏళ్లనాటి ప్రజల నిరీక్షణకు తెరపడనున్నదని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి చెప్పారు. తాజాగా రేషన్ కార్డుల పంపిణీతోపాటు పాత రేషన్ కార్డులలో మార్పులు, చేర్పులు చేసుకునే వెసులుబాటు ప్రభుత్వం కల్పించిందని ఆయన చెప్పారు.ఇందిరమ్మ ఆత్మీయ భరోసాతో రైతు కూలీలకూ న్యాయం.రైతు కూలీలకు కూడా న్యాయం చేయాలనే ఉద్దేశం కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మఆత్మీయ భరోసా పథకాన్ని ప్రవేశపెడుతోందని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ చెప్పారు. రైతు కూలీలకు సంవత్సరానికి 12 వేల రూపాయల ఆర్థిక సాయాన్ని అందించడం జరుగుతుందన్నారు.
గ్రామసభ అడ్డుకోవడానికి గులాబీల యత్నాలు.
లక్ష్మీపూర్ లో నిర్వహిస్తున్న గ్రామసభను అడ్డుకునేందుకు కొంత మంది బీఆర్ఎస్ నాయకులు ప్రయత్నించారు. అయితే బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ చేపట్టిన పథకాలపైన, ఎన్నికల హామీలపైన ప్రశ్నలు సంధించగా,సభలో ఉన్న ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ వారికి తగిన సమాధానాలు చెప్పారు.అంతే కాకుండా వారి సందేహాలన్నింటినీ ఆయన నివృత్తి చేయడంతో వికసించని గులాబీ లు సభ నుంచి జారుకున్నారు. ఈ గ్రామసభలో మండల పరిషత్ అభివృద్ధి అధికారితోపాటు బెజ్జంకి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ, వైస్ చైర్మన్ సిహెచ్ శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముక్కిస రత్నాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## రైలు పట్టాలపై హెూంగార్డ్ అత్మహత్య యత్నం

**- కాపాడిన రైల్వే పోలీసులు...**

**కబురు న్యూస్,నిజామాబాద్,జనవరి 21:**



నిజామాబాద్ రైల్వే స్టేషన్ వద్ద రైలు పట్టాల మీద ఓ హెూంగార్డు అత్మహత్యయత్నం చేశారు.మంగళవారం తెల్లవారు జామును రైలు పట్టాల మీద ఒక వ్యక్తి అత్మహత్యకు ప్రయత్నిస్తున్నాడని అతని భార్య డయల్ 100 కు పోన్ చేసి సమాచారం అందించింది.కంట్రోల్ రూం ద్వారా వచ్చిన సమాచారంతో రైల్వే ఎస్ఐ సాయిరెడ్డి అక్కడ విధులు నిర్వహిస్తున్న రైల్వే పోలీస్ హెడ్ కానిస్టెబుల్ కుబేరుడు,కానిస్టేబుల్ రాములు లను అప్రమత్తం చేశారు.అక్కడ స్థానికంగా రైలు పట్టాలపై కుర్చున్న తాటికోండ నర్సయ్యను గుర్తించి ఆత్మహత్యాయత్నంను అడ్డుకున్నారు.
నిజామాబాద్ నగరంలోని జండాగల్లికి చెందిన తాటికోండ నర్సయ్య హెూంగార్డ్ గా పనిచేస్తున్నారు.అతని భార్య,అత్తమామల వేదింపులు భరించలేకనే ఆత్మహత్య చేసుకోవాలని అనుకున్నట్టు రైల్వే పోలీసులకు తెలిపారు.అతడిని నాల్గవ టౌన్ పోలీసలకు అప్పగించినట్లు రైల్వే ఎస్ఐ సాయిరెడ్డి తెలిపారు.

## ప్రారంభమైన దరఖాస్తుల స్వీకరణ...




**కబురు న్యూస్, బోధన్ జనవరి 21..**
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు పథకాలకు సంబంధించి అర్హుల గుర్తింపు ఇందిరమ్మ ఇళ్లు, రైతుభరోసా, కొత్త రేషన్కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా నాలుగు పథకాల దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం ప్రారంభమైంది. మంగళవారం పట్టణంలోని 5వార్డులో రాకాసిపేట్ లో లబ్ధిదారుల ఎంపిక లబ్ధిదారుల జాబితా సభలో ప్రకటన, అర్హత ఉన్నా పేర్లు, లేకపోతే మళ్లీ దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా అర్హులై ఉండి లబ్ది పొందని వారు ఎలాంటి ఆందోళనలకు గురి కావద్దని, ఈ నెల 24 వరకు కొనసాగే వార్డు సభలలో దరఖాస్తు చేసుకోవాలని యువజన కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు తలారీ నవీన్ సూచించారు.

## శ్రీ రామాంజనేయ ఆలయానికి ఉత్సవ విగ్రహాలు అందజేత...

**- కరీంనగర్ ఆంధ్రజ్యోతి దినపత్రిక బ్రాంచ్ మేనేజర్ కళ్లెపు సంపత్ రెడ్డి...**

**కబురు న్యూస్, వీణవంక, జనవరి 21.**




వీణవంక మండలం మల్లారెడ్డిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ రామాంజనేయ దేవాలయంలో ప్రతి ఏటా శ్రీరామనవమికి కళ్యాణ మహెూత్సవం జరుపుటకు గాను శ్రీరాముడు, సీత, లక్ష్మణ, ఆంజనేయ ఉత్సవ విగ్రహాలను మల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన కళ్లెపు వీరారెడ్డి- కాంతమ్మ దంపతులు వారి కుమారుడు కోడలు కళ్లెపు సంపత్ రెడ్డి-స్వర్ణలత (ఆంధ్రజ్యోతి దినపత్రిక కరీంనగర్ బ్రాంచ్ మేనేజర్) మల్లారెడ్డిపల్లి గ్రామ మాజీ సర్పంచ్ మేకల ఎల్లారెడ్డి కి అందజేశారు.ఈ సందర్భంగా కరీంనగర్ జిల్లా ఆంధ్ర జ్యోతి దినపత్రిక బ్రాంచ్ మేనేజర్ సంపత్ రెడ్డి మాట్లాడుతూ..భగవంతుడు మాకు ఈ అవకాశాన్ని కల్పించడం మా పూర్వజన్మ సుకృతంగా భావిస్తూ ఈ మహత్తర కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ వారీ సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మల్లారెడ్డిపల్లి గ్రామ మాజీ సర్పంచులు మేకల శ్రీనివాస్ రెడ్డి,మేకల ఎల్లారెడ్డి, అమ్మ ఫౌండేషన్ మల్లారెడ్డిపల్లి వ్యవస్థాపక అధ్యక్షులు గోనెల సమ్మన్న ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి ముద్దసాని శ్రీనివాస్, వీణవంక మండల ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులు పల్లెర్ల కిరణ్ గుప్తా, గుమ్మడి సంపత్, కాంగ్రెస్ పార్టీ మల్లారెడ్డిపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు నిమ్మల సమ్మయ్య ముదిరాజ్, గంధం సుమన్,బండారి అనిల్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## తెలంగాణ విద్యాశాఖ నిబంధనలు పాటించని ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

**- సామాజిక కార్యకర్త - గట్టు సాయిరాం**

**కబురు న్యూస్, జమ్మికుంట జనవరి 21**





హుజురాబాద్ మండల పరిధిలో గల ఏకశిలా , టెట్రా హెడ్రోన్ , మోంటెసరి, గ్రీన్ సైడ్జ్,కేరళ,న్యూ కాకతీయ పాఠశాలలలో రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖ నిబంధనలు పాటించకపోవడమే కాకుండా వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థులకు విద్యా బోధన సక్రమంగా లేకపోవడం వల్ల విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు ఈ విషయంపై స్థానిక హుజురాబాద్ మండల విద్యాధికారి కి వినతి పత్రం అందజేయడం జరిగింది కావున తక్షణమే ఆ పాఠశాలలపై చర్యలు తీసుకొని పాఠశాలలను సీజ్ చేయాలని కోరడమైనది లేనియెడల పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు


## ఏళ్లు గడుస్తున్న...కల్వల ప్రాజెక్ట్ పై కనికరం చూపని ప్రజా ప్రతినిధులు ...

- సాగునీటి కోసం రైతులకు తప్పని తిప్పలు...
- సొంత ఖర్చులతో రెండవసారి తాత్కాలిక కట్ట మరమ్మత్తులు...

**కబురు న్యూస్, వీణవంక, జనవరి 21.**







జమ్మికుంట,వీణవంక, కేశవపట్నం మండల రైతులకు సాగునీటి కల్పతరువుగా, వర ప్రసాదంగా పేరుగాంచిన కల్వల ప్రాజెక్ట్ గత రెండు సంవత్సరాల క్రితం కురిసిన భారీ వర్షాలకు వరద ప్రవాహం పెరిగి ముత్తడి పూర్తిగా ధ్వంసం అయింది. అప్పటినుండి రైతులు సొంత ఖర్చులతో ప్రతి పంట కోసం కరకట్ట నిర్మించుకొని సాగునీరును వాడుకుంటున్నారు. అలాగే రబీ సీజన్లో నవంబర్ మాసంలో రైతులు ఎకరాకి 1000 రూపాయల చొప్పున వసూలు చేసి, కరకట్ట నిర్మించుకోగా, ఎస్సారెస్పీ సాగునీరు ఆలస్యంగా ఉండడంతో, కల్వల ప్రాజెక్ట్ ఆధారిత రైతులు వీణవంక చెరువు నుండి సాగు నీటిని పంట పొలాలకు తరలించి వాడకం చేశారు. ఇటీవలే ఎస్సారెస్పీ నీటి విడుదల చేయడంతో కల్వల ప్రాజెక్ట్ లోకి నీరు రాగానే వారం రోజులు సంతోష సంబరాలతో పంటపొలాలకు సాగునీరును వాడుకున్నారు. కానీ,వ్యవసాయ ఆధారిత గ్రామాలైన కల్వల, కాచాపూర్,మల్లన్న పల్లె, బ్రాహ్మణపల్లి, వీణవంక, రామకృష్ణాపూర్, రెడ్డిపల్లి, పోతిరెడ్డిపల్లి, లస్మక్కపల్లి గ్రామాల రైతులు, కేశపట్నం ఎస్కేప్ వద్ద సాగునీటిని విడుదల చేయడంతో, ప్రాజెక్టులో నీరు ఎక్కువ చేరడంతో, కలువల ప్రాజెక్టులో నీటి నిల్వ కోసం వీణవంక రైతులు సొంత ఖర్చుతో నిర్మించుకున్న కరకట్ట తెగిపోవడంతో వారం రోజులుగా పంట పొలాలకు సాగునీరు లేక పంట పొలాలు నెర్రలు పారుతూ, పంట పొలాలు ఎండిపోయే పరిస్థితి దాపరించింది. మళ్లీ రెండవసారి వీణవంక రైతులు చేసేది ఏమీ లేక మళ్లీ ఎకరాకు 1000 రూపాయల చొప్పున వసూలు చేసి, కరకట్ట పునర్నిర్మాణం చేపడుతున్నారు. ఇప్పటికైనా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం,ప్రజా ప్రతినిధులు, నీటిపారుదల శాఖ అధికారులు వెంటనే కలగజేసుకుని, కల్వల ప్రాజెక్ట్ పునర్నిర్మానం చేపట్టాలని ఆధారిత గ్రామాల రైతులు, కల్వల, వీణవంక గ్రామాల రైతులు వేడుకుంటున్నారు.

## ప్రభుత్వ పథకాల అమలుకు పారదర్శకంగా అర్హుల ఎంపిక.....

# జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

**- పథకాల అమలు నిరంతర ప్రక్రియ**
**- నూతన కార్యక్రమాల లబ్ధిదారుల జాబితాపై అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలి ఖమ్మం రూరల్ మండలం గోళ్ళపాడు గ్రామం, ఖమ్మం నగరం 6వ డివిజన్ లో నిర్వహించిన గ్రామ/ వార్డు సభలలో పాల్గొన్న జిల్లా కలెక్టర్**

కబురు న్యూస్, ఖమ్మం ప్రతినిధి:-
ప్రభుత్వ పథకాల అమలుకు పారదర్శకంగా అర్హులను ఎంపిక చేస్తున్నామని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు.మంగళవారం జిల్లా కలెక్టర్, ఖమ్మం రూరల్ మండలం గోళ్ళపాడు గ్రామం, ఖమ్మం నగరం 6వ డివిజన్ లో నాలుగు నూతన పథకాల అమలుపై నిర్వహించిన గ్రామ/ వార్డు సభలలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ, ప్రభుత్వం నూతనంగా అమలు చేయనున్న నాలుగు పథకాల అర్హుల ప్రాథమిక జాబితాను పరిశీలించి చేర్పులు, మార్పులు ఏవైనా ఉంటే చర్చ పెట్టుకోవాలని అన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా,



నూతన రేషన్ కార్డుల మార్గదర్శకాలను గ్రామ వాట్సప్ గ్రూపులు, న్యూస్, అధికారుల ద్వారా తెలియజేశామని అన్నారు.4 నూతన కార్యక్రమాలకు సంబంధించి క్షేత్ర స్థాయి పరిశీలన చేసి లబ్ధిదారుల యొక్క ప్రాథమిక జాబితా గ్రామసభలలో పెడుతున్నామని, ఎక్కడ ఎటువంటి దాపరికాలు లేకుండా, పూర్తి పారదర్శకంగా ప్రజలకు తెలిసేలా పథకాల అమలు ఉంటుందని, జాబితాలో అనర్హులు ఎవరైనా ఉంటే వివరాలు అందించాలని మళ్లీ విచారణ చేయిస్తామని అన్నారు. ప్రాథమిక జాబితాలో అర్హులు ఎవరైనా లేని పక్షంలో గ్రామ సభలలో లేదా ఎంపీడీవో కార్యాలయం, తహసిల్దార్ కార్యాలయాలలో ఉన్న ప్రజా పాలన కేంద్రాలలో మళ్లీ దరఖాస్తులను తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. ఆ దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వారికి పథకాల లబ్ది చేకూరుస్తామని అన్నారు. గ్రామ సభ/వార్డు సభల వద్ద హెల్ప్ డెస్క్ ఏర్పాటుచేసినట్లు, జాబితా లో పేర్లు సరిచూసుకోనుటకు, జాబితాలో పేర్లు లేని వారికి దరఖాస్తు పెట్టుకొనుటకు అధికారులు సహకరిస్తారని కలెక్టర్ తెలిపారు.ప్రస్తుతం గ్రామ సభలలో పెట్టిన జాబితా, ప్రాథమిక జాబితా మాత్రమేనని తుది జాబితా కాదని, ప్రజలు ఎవరు ఆందోళన చెందకుండా ఉండాలని, పథకాల అమలు నిరంతర ప్రక్రియ అని, అర్హులందరికీ పథకాలు అందుతాయని కలెక్టర్ అన్నారు.ఈ సమావేశంలో ఖమ్మం రూరల్ మండల ప్రత్యేక అధికారిణి/జిల్లా బిసి సంక్షేమ అధికారిణి జి. జ్యోతి, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు సరిత, ఖమ్మం రూరల్ మండల తహసీల్దార్ రాంప్రసాద్, ఎంపీడీఓ కుమార్, ఏపీఎం శ్రీదేవి, పంచాయతీ కార్యదర్శి ధనలక్ష్మి, అధికారులు, తదితరులు పాల్గొన్నారు....

# అయితగాని జనార్ధన్ కు తెలుగు కీర్తి అవార్డు



**- వరల్డ్ రైటర్స్ ఫోరం, వరల్డ్ పోయెట్రీ అకాడమి, టీ ఏ ఎన్ ఎ బుక్ ఆఫ్ రికార్డ్స్ మరియు శ్రీ శ్రీ కళావేదికల సంయుక్త సత్కారం**

కబురు న్యూస్, ఖమ్మం
తెలుగు సాహితీ లోకంలో వివిధ సాహిత్య ప్రక్రియల్లో ప్రతిభను కనబరిచిన వారికి శ్రీ శ్రీ కళావేధిక మరియు వరల్డ్ రైటర్స్ ఫోరం, వరల్డ్ పోయెట్రీ అకాడమి, టీ ఏ ఎన్ ఎ బుక్ ఆఫ్ రికార్డ్స్ వారు సంయుక్తంగా జాతీయ ప్రతిభా పురస్కారాలు అందించారు. విజయవాడ నగరంలో శ్రీ కౌత పూర్ణానంద విలాస్ కళావేధికలో జరిగిన జాతీయ స్థాయి కార్యక్రమంలో ఈ అవార్డుల ప్రధానోత్సవం నిర్వహించారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాలకు చెందిన సాహిత్యంలో ప్రతిభ కనబరిచిన యువ కవులకు, రచయితలకు ఈ అవార్డులు అందజేశారు. విశిష్టమైన ఈ కార్యక్రమంలో ఖమ్మం జిల్లాకు చెందిన అయితగాని జనార్ధన్ సాహితీ ప్రతిభకు గాను ఆయనకు తెలుగు కీర్తి అవార్డు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బోయి భీమన్న గారి సతీమణి బోయి హైమావతి, శ్రీ శ్రీ కళావేధిక సీ ఈ ఓ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, జాతీయ కన్వీనర్ రమావతి, ఈశ్వర్ భూషణ్, బోయపాటి చంద్రశేఖర్, తీగల సుదర్శన్ తో బాటు రెండు తెలుగు రాష్ట్రాల సాహితీ వేత్తలు, కవులు, కళాకారులు పాల్గొన్నారు...

# అట్టహాసంగా ఏదులాపురం ఏఐకేఎస్ గ్రామ మహాసభ

**- రైతుల పట్ల నరేంద్ర మోడీ కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారు : దండి సురేష్**
**- ఏకగ్రీవంగా నూతన కమిటీ ఎన్నిక**

కబురు న్యూస్, ఖమ్మం రూరల్ :-
ఖమ్మం రూరల్ మండలం ఎదులాపురం గ్రామంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం (ఏఐకేఎస్ ) గ్రామ మహాసభ సోమవారం రాత్రి అటహాసంగా జరిగింది. తొలుత అక్కడ డిబిఆర్ భవన్ వద్ద ఏర్పాటుచేసిన ఏఐకే జెండాను సిపిఐ సీనియర్ నాయకులు మామిండ్ల నిరంజన్ రెడ్డి ఆవిష్కరించారు. మిడ కంటి పెద వెంకట్ రెడ్డి , వెన్నం భాస్కర్ అధ్యక్షతన నిర్వహించిన సభలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ మాట్లాడారు... ప్రధాని మోడీ కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తూ రైతుల పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. దీంతో రైతులకు ఆదరువు కరువై ఆహార ఉత్పత్తులు తగ్గుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అన్నం పెట్టే రైతన్నకు అండగా నిలిచి వ్యవసాయ రంగాన్ని






కాపాడుకోవడానికి ఏఐకేఎస్ పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎదులాపురం గ్రామ ఏఐకేఎస్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా మిడకంటి పెద్ద వెంకటరెడ్డి, రామిడి రమేష్, అధ్యక్షునిగా మామిడి సుదర్శన్ రెడ్డి, ఉపాధ్యక్షునిగా బొడ్డు ఉపేందర్, సహాయ కార్యదర్శిగా ఘనపరపు వీరన్న, కార్యదర్శిగా వెన్నం భాస్కర్, ఉపాధ్యక్షులుగా ఎర్ర ప్రభాకర్, వేర్పుల రాములు కోట శ్రీనివాసరెడ్డి, సహాయ కార్యదర్శులుగా బుద్ధి రాధాకృష్ణ ,బుద్ధి వెంకన్న ,ఉపాధ్యక్షులుగా వెంపటి సురేందర్ ,సహాయ కార్యదర్శిగా పొన్నెకంటి అఖిల్, సభ్యులుగా మామిండ్ల నిరంజన్ రెడ్డి ,నారపాటి రామారావు, గంధం రవి, మామిండ్ల నరేందర్ ,ఓరుగంటి రామారావు, దస్తగిరి ,తేలూరి వెంకన్న, శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండపర్తి గోవిందరావు ,రైతు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మిడకంటి చిన్న వెంకటరెడ్డి, సిపిఐ పార్టీ జిల్లా సమితి సభ్యులు చెరుకుపల్లి భాస్కర్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బానోతు రామ్ కోటి ,పాలేరు నియోజకవర్గ రైతు సంఘం నాయకులు ఎడ్లపల్లి శంకరయ్య, ఎదులాపురం-వరంగల్ క్రాస్ రోడ్ శాఖా కార్యదర్శులు వెంపటి సురేందర్, రామిడి రమేష్ ,యువజన సంఘం సభ్యులు మామిండ్ల శ్రీనాథ్ రెడ్డి ,ఘనపరపు ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు...

# పోలీస్ బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించిన పోలీస్ కమిషనర్



కబురు న్యూస్,ఖమ్మం
ప్రభుత్వ పథకాలకు లబ్దిదారుల ఎంపిక కోసం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ సభలు కొనసాగుతున్న నేపథ్యంలో ఖమ్మం కమిషనరేట్ పరిధిలోని గ్రామ సభల వద్ద శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా స్దానిక పోలీసులు ఏర్పాటు చేసిన బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ మంగళవారం పలు గ్రామ సభలు సందర్శించి స్దానిక బందోబస్తు నిర్వహిస్తున్న SHO లు , సెక్టార్ పోలీస్ ఆఫీసర్లతో మాట్లాడారు. ఖమ్మం నియోజకవర్గం పరిధిలోని మంచుకొండ, మధిర నియోజకవర్గం పరిధిలోని నాగులవంచ, పాలేరు నియోజకవర్గం పరిధిలోని మధులపల్లి గ్రామ సభలను సందర్శించి ఏలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అప్రమత్తంగా వుండాలని పోలీస్ అధికారులకు సూచించారు. ఏదైన సమస్యలకు వెంటనే హాజరు కావాలని ఆదేశించారు.



# మహాలక్ష్మి పథకాన్ని అమలు చేయండి

**-అర్హులైన వారందరికీ ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలి**
**-మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి ఏపూరి లతాదేవి**

కబురు న్యూస్, ఖమ్మం ప్రతినిధి:-

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మహిళల ఖాతాల్లో నెలకు రూ. 2,500 జమ చేసే మహాలక్ష్మి పథకాన్ని వెంటనే అమలు చేయాలని తెలంగాణ మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ అనుబంధం) జిల్లా కార్యదర్శి ఏపూరి లతాదేవి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించినప్పటికీ తగినన్ని బస్సులు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆమె తెలిపారు. తెలంగాణ




మహిళా సమాఖ్య ఖమ్మంజిల్లా కార్యవర్గ సమావేశం మంగళవారం జిల్లా అధ్యక్షురాలు పోటు కళావతి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఏపూరి లతాదేవి మాట్లాడుతూ మహిళల పట్ల ఇప్పటికి వివక్ష సాగుతుందన్నారు. ప్రభుత్వ పథకాలు మొదలు రక్షణ వరకు ఇబ్బందికర పరిస్థితులు తలెత్తుతున్నాయన్నారు. ఇంటా బయట రక్షణ లేని పరిస్థితి నెలకొన్నదని కోల్కతాలో వైద్యురాలిపై అత్యాచారం చేసిన వ్యక్తికి మరణ శిక్ష విధించాలని ఆమె డిమాండ్ చేశారు. మహిళలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం సత్వరం నెలకు రూ.2,500 మహిళల ఖాతాల్లో జమ చేయాలన్నారు. భూమి లేని నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వర్తింపజేయాలని, అర్హత కలిగిన వారందరికీ రేషన్కార్డులు ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. మహిళా సమాఖ్య నిర్మాణ మహాసభలను ఫిబ్రవరి మొదటి వారం నుంచి ప్రారంభించనున్నట్లు లతాదేవి తెలిపారు. ఫిబ్రవరిలో గ్రామ, మండల మహాసభలను పూర్తి చేస్తామని మార్చి మొదటి వారంలో జిల్లా మహాసభలు జరుగుతాయని లతాదేవి తెలిపారు. ఈ సమావేశంలో మహిళా సమాఖ్య కార్యనిర్వహక అధ్యక్షురాలు తాటి నిర్మల, ప్రమీల, రజిత, మమత, సరోజినమ్మ, లక్ష్మి తదితరులు

# మాజీ సర్పంచ్ కుటుంబ సభ్యులను పరామర్శించిన జెఎస్ఆర్

ఖమ్మం హుస్నాబాద్ -
హుస్నాబాద్ నియోజకవర్గం చిగురుమామిడి మండలం నవాబ్ పేట గ్రామ మాజీ సర్పంచ్ చెప్యాల వేణు గారు గుండె పోటు తో మరణించిన విషయం తెలుసుకొని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు JSR గారు వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.వారి యొక్క చిత్ర పటానికి పూల మాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.చిన్న వయస్సులోనే వేణు గుండె పోటు తో మరణించడం బాధాకరం అని,ఎంతో ఆప్యాయంగా మాట్లాడే వ్యక్తి వేణు మరణం తీరని లోటని అన్నారు.వారి మృతి పట్ల ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసి,వారి కుటుంబానికి భగవంతుడు మనో ధైర్యాన్ని ప్రసాదించాలని అన్నారు.వీరి వెంట చిగురుమామిడి మండల మాజీ అధ్యక్షుడు పైడిపల్లి శ్రీనివాస్,సంపత్,సంతిష్, శ్రీశైలం తదితరులు ఉన్నారు



# ఈనెల 25 న ఖమ్మం సర్ధార్ పటేల్ స్టేడియంలో U-17 బాలుర క్రికెట్ పోటీల ఎంపికలు..

**- తెలంగాణ క్రీకెట్ అసోసియేషన్ కో-ఆర్డినేటర్ మహమ్మద్ మతీన్ వెళ్ళడి..**

కబురు న్యూస్, ఖమ్మం :-
తెలంగాణా జిల్లాల క్రికెట్ అసోసియేషన్ సారద్యంలో ఖమ్మం జిల్లా అండర్ 17 క్రికెట్ బాలుర జట్ల ఎంపికలు ఈ నెల 25-1-2025 న సర్ధార్ వల్లభాయ్ పటేల్ స్టేడియం లో జరుగుతున్నట్లు తెలంగాణ క్రీకెట్ అసోసియేషన్ కో-ఆర్డినేటర్ మహమ్మద్ మతీన్ పేర్కొన్నారు.టోర్నమెంట్ T- 20-20 ఫార్మాడ్ లో ఈ పోటీలు జరుగుతాయని తెలిపారు.,ఆసక్తి గల గ్రామీణ క్రీడాకారులు స్టడీకండక్ట్ సర్టిఫికెట్ లు వెంట తెచ్చుకోవాలని, , తెలుపు దుస్తులు వైట్ డ్రెస్ తప్పనిసరీ అని చెప్పారు. ఎంపికైన క్రీడాకారులకు




హైద్రాబాద్లో జరిగే ఇంటర్ డిస్ట్ టోర్నమెంట్ లో పాల్గొంటారని వెల్లడించారు. హైద్రాబాద్ లో జరిగే టీ 20 ఫార్మెడ్ టోర్నమెంట్లో TDCA తెలంగాణా జిల్లాల క్రీకెట్ అసోసియేషన్ వ్యవస్థాపకులు అల్లిపురం వెంకటేశ్వరరెడ్డి సారథ్యంలో టోర్నమెంట్లో జరుగుతాయని ఆయన తెలిపారు.ఈ ఎంపికైన క్రీడా జట్టుకు ఉచిత వసతి భోజన సౌకర్యంతో పాటు రవాణా ఖర్చులు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.వివరాలు వెల్లడించిన



వారిలో
కన్వీనర్లు, శ్రీనివాస్, నాగేశ్వర్, ప్రసాద్, సాయి నిరంజన్, మురళి ఇమ్రాన్, సైదా శివ శోభన్ లు వున్నారు...

# 13 ఏళ్ల తర్వాత దేశవాళి టోర్నీల్లోకి కోహ్లీ




**కబురు క్రీడలు, జనవరి 21:**
టీమ్ఇండియా రన్నింగ్ మెషిన్ విరాట్ కోహ్లీ 13 ఏళ్ల తర్వాత రంజీ ట్రోఫీలో బరిలో దిగనున్నాడు. గతకొంతకాలంగా ఫామ్? లేమితో సతమతమవుతున్న ఈ స్టార్ క్రికెటర్?, తన పెర్ఫామెన్స్?ను మెరుగుపరుచుకునేందుకు సిద్ధమయ్యాడు. 2012లో చివరగా రంజీ మ్యాచ్ ఆడాడు. మళ్లీ ఇన్నేళ్లకు ఇప్పుడు ఈ ప్రతిష్టాత్మక దేశవాళీ టోర్నీలో ఆడనున్నాడు. ఇక జనవరి 30 నుంచి రైల్వేస్‌తో జరగనున్న చివరి లీగ్ మ్యాచ్‌లో దిల్లీ తరఫున బరిలోకి దిగనున్నాడు. అంతకుముందు జనవరి 23 నుంచి దిల్లీ, సౌరాష్ట్ర మ్యాచ్ మొదలవనుంది. అయితే మెడనొప్పి కారణంగా విరాట్ ఈ మ్యాచ్ ఆడట్లేదు. కానీ రైల్వేస్‌తో మ్యాచ్‌కు మాత్రం అందుబాటులో ఉంటానంటూ దిల్లీ క్రికెట్ అసోసియేషన్‌కు సమాచారం అందించాడు. దిల్లీ టీమ్ హెడ్ కోచ్ శరణ్‌దీప్ సింగ్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. మరోవైపు అంతర్జాతీయ మ్యాచ్‌లు లేని టైమ్?లో అందుబాటులో ఉంటే ప్లేయర్లు తప్పకుండా దేశవాళీ లీగ్‌ల్లో ఆడాలని ఇటీవల బీసీసీఐ ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ విషయంలో స్టార్ క్రికెటర్లకు మినహాయింపులు ఉండవని పేర్కొంది. దీంతో రోహిత్ శర్మతో పాటు రవీంద్ర జడేజా, రిషబ్ పంత్, శుభ్‌మన్ గిల్, యశస్వి జైస్వాల్ లాంటి ఆటగాళ్లు రంజీ ట్రోఫీలో ఆడనున్నారు. గతేడాది 10 టెస్టుల్లో విరాట్ కోహ్లీ 24.52 సగటుతో కేవలం 417 పరుగులు మాత్రమే చేశాడు. అందులో ఒక శతకం, ఒక హాఫ్ సెంచరీ ఉంది. ఓవరాల్ గా అన్ని ఫార్మాట్లలో కలిపి గతేడాది 32 ఇన్నింగ్స్ ల్లో 21.83 సగటుతో కేవలం 655 పరుగులు మాత్రమే చేసి విఫలమయ్యాడు. మరోవైపు, పేలవ ఫామ్?తో ఇబ్బందిపడుతున్న కోహ్లీకి భారత మాజీ బ్యాటింగ్ కోచ్ సంజయ్ బంగర్ మద్దతుగా నిలిచాడు. కోహ్లీ మంచి ఫిట్?నెస్?తో ఉన్నాడని, అతడు మరికొన్నేళ్లు క్రికెట్ ఆడొచ్చని అభిప్రాయపడ్డాడు. "నేను ఇప్పటికీ కోహ్లీకి మద్దతు ఇస్తున్నాను. 36 ఏళ్ల వయసులో కూడా అతను ఎప్పటిలాగే ఫిట్?గా ఉన్నాడు. అతని ఫిట్?నెస్ స్థాయిలు అద్భుతంగా ఉన్నాయి." అని బంగర్ అన్నాడు.

## నా కుమారుడికి అన్యాయం చేస్తున్నారు
## సంజూ శాంసన్ తండ్రి ఆగ్రహం




**కబురు క్రీడలు, జనవరి 21:**
ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ కోసం ఎంపిక చేసిన జట్టులో టీమ్ఇండియా వికెట్ కీపర్ సంజూ శాంసన్?కు చోటు కల్పించకపోవడం క్రికెట్ ప్రియుల్ని ఆశ్చర్యానికి గురి చేసింది. వైట్?బాల్ క్రికెట్?లో సంజు రీసెంట్ ఫామ్ చూస్తే, అతడిని కచ్చితంగా ఎంపిక చేస్తారనే అంతా భావించారు. కానీ అతడిని సెలెక్ట్ చేయకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. ఈ క్రమంలో కేరళ క్రికెట్ సంఘంపై సంజూ శాంసన్ తండ్రి శాంసన్ విశ్వనాథ్ తీవ్ర ఆరోపణలు చేశారు. విజయ్ హజారే టోర్నీలో ఆడడని సంజూ శాంసన్ శిక్షణా శిబిరం ప్రారంభానికి ముందే తెలియజేశాడని వ్యాఖ్యానించారు. ఈ క్రమంలో కేసీఏపై శాంసన్ విశ్వనాథ్ తీవ్ర విమర్శలు గుప్పించారు. "శిక్షణా శిబిరంలో పాల్గొనని ఇతర ఆటగాళ్లు విజయ్ హజారేలో ఎలా ఆడారు. వాళ్లెవరో నాకు తెలుసు. దానికి కేసీఏ దగ్గర సమాధానం ఉందా?. సంజు కంటే ముందు నా పెద్ద కొడుకు సాలీ కేరళ తరఫున ఆడాడు. అండర్-19 జట్టు తరఫున సెంచరీ చేశాడు. ఆ తర్వాత రంజీ క్యాంప్?కు హాజరైన అతడు మంచి పెర్ఫామెన్స్ ఇచ్చాడు. కానీ అతనికి రంజీ ట్రోఫీ జట్టులో చోటు దక్కలేదు. ఆ తర్వాత కేరళ అండర్-25 జట్టులోకి వచ్చినా అవకాశాలు ఇవ్వలేదు." అని శాంసన్ విశ్వనాథ్ వ్యాఖ్యానించారు. కేరళ క్రికెట్ అసోసియేషన్?లో కొంతమందికి తన కుమారుడు శాంసన్ మీద వ్యతిరేకత ఉందని ఆరోపించారు విశ్వనాథ్. "సంజు కంటే ముందే భారత జట్టుకు ఆడాల్సిన నా పెద్ద కొడుకుకి అవకాశం దక్కలేదు. కేసీఏలో ఉన్న కొద్ది మంది వ్యక్తులు నా కుమారుడికి వ్యతిరేకంగా పనిచేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఒకసారి రంజీ మ్యాచ్?లో సంజు రెండు మోకాళ్లకు గాయాలయ్యాయి. అప్పుడు విశ్రాంతి కోసం సెలవు అడగడానికి అప్పటి కేసీఏ అధ్యక్షుడి టీసీ మాథ్యూ వద్దకు వెళ్లాను. అతడితో చాలా గౌరవంగా మాట్లాడాను. కానీ నాతో అతడు వాగ్వాదానికి దిగారు. నాతో చాలా దారుణంగా మాట్లాడారు." అని ఓ ఇంటర్వ్యూలో శాంసన్ విశ్వనాథ్ ఆరోపించారు. "పిల్లలు ఏం పొరపాటు చేశారో నాకు తెలియదు. ఏదైనా తప్పు చేసి ఉంటే నాకు ఫోన్ చేస్తే సమాధానం చెప్పేవాడిని. మేం ఎప్పుడూ కేసీఏకు వ్యతిరేకంగా లేము. కేసీఏలోని కొందరికే మాతో సమస్య. వారికి నమస్కారం పెట్టకపోయినా ఇబ్బందే. తాను మాట్లాడేది జయేశ్ జార్జ్ (కేసీఏ అధ్యక్షుడు), వినోద్ కుమార్ (బోర్డు కార్యదర్శి) గురించి కాదు. చిన్న చిన్న విషయాలకు ప్రతిదాన్ని విషంగా మార్చే కొంతమంది చిన్న వ్యక్తులు ఉన్నారు. నాకు కావలసిందల్లా సంజు ఆడటానికి న్యాయమైన అవకాశం. ఏదైనా తప్పు జరిగితే మేము చర్చకు సిద్ధంగా ఉన్నాం. దాన్ని సరిదిద్దుకోవడానికి సిద్ధంగా ఉన్నాం" అని శాంసన్ విశ్వనాథ్ పేర్కొన్నారు. మరోవైపు సంజు రీసెంట్?గా విజయ్ హజారే ట్రోఫీ ఆడకపోవడం వల్లే, జట్టు నుంచి తప్పించారనే వాదనలు వినిపిస్తున్నాయి. టీమ్?ఇండియాకు ఆడాలనుకునే ప్లేయర్స్ దేశవాళీ టోర్నీల్లో కచ్చితంగా ఆడాలి. కానీ సంజూ శాంసన్ మాత్రం విజయ్ హజారే ట్రోఫీలో ఆడలేదు. ఈ కారణంగానే అతడిని ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీకి ఎంపిక చేయకపోయినట్లు ప్రచారం సాగుతోంది.

## షమి ఫిట్‌గా ఉన్నందుకు ఆనందంగా ఉంది

### భారత మాజీ క్రికెటర్ సౌరభ్ గంగూలీ




**కబురు క్రీడలు, జనవరి 21:**
చాలాకాలం తర్వాత టీమిండియా సీనియర్ ఫాస్ట్‌బౌలర్ మహమ్మద్ షమీ మళ్లీ భారత జెర్సీలో కనిపించబోతున్నాడు. 2023 వన్డే ప్రపంచకప్ ఫైనల్ అనంతరం గాయంతో జట్టుకు దూరంగా ఉన్న షమి, ఇప్పుడు 2025 ఛాంపియన్స్ ట్రోఫీ ముంగిట పునరాగమనం చేయడానికి సిద్ధమయ్యాడు. ఇంగ్లాండ్‌తో జరుగనున్న టీ20 సిరీస్, వన్డే సిరీస్‌తో పాటు తర్వాత జరిగే ఛాంపియన్స్ ట్రోఫీ కోసం కూడా అతడు ఎంపికయ్యాడు. షమి రీ ఎంట్రీపై భారత మాజీ క్రికెటర్ సౌరభ్ గంగూలీ సంతోషాన్ని వ్యక్తం చేశాడు. షమి జట్టులో చేరడంతో టీమ్ఇండియా బలం మరింత పెరిగిందని ఆయన చెప్పారు. షమి ఫిట్‌గా ఉన్నందుకు నాకు చాలా ఆనందంగా ఉంది. అతను జస్‌ప్రీత్ బుమ్రా తర్వాత భారతదేశంలో బౌలర్ అని నేను భావిస్తున్నాను. షమి కొంత భయాందోళనతో ఉండవచ్చు, ఎందుకంటే మోకాలి గాయం తర్వాత చాలా కాలం క్రికెట్ ఆడడం. కానీ దేశవాళీ క్రికెట్లో బెంగాల్ తరఫున ఆడడం అతడికి ఎంతో అనుకూలంగా ఉంటుందని నేను నమ్ముతాను. ఈ అనుభవం రాబోయే మ్యాచ్‌ల్లో అతడికి ఎంతో ఉపయోగపడుతుంది. షమి జట్టులోకి రావడం, బుమ్రాపై భారం తగ్గించడంతో టీమ్ఇండియా ప్రదర్శన మెరుగుపడుతుంది. బుమ్రా ఒక ఎండ్ నుంచి, షమి మరో ఎండ్ నుంచి బౌలింగ్ చేయడం విశేషంగా ఉంటుంది. ఈ ద్వయం టెస్టు క్రికెట్లో కూడా సక్సెస్ అయ్యింది" అని గంగూలీ పేర్కొన్నాడు. ఇటీవల ముగిసిన బోర్డర్-గావస్కర్ ట్రోఫీలో జస్‌ప్రీత్ బుమ్రా పేస్ బౌలింగ్‌లో పెద్ద భారం మోశాడు.అతను ఎక్కువ పని భారం ఉన్న కారణంగా గాయపడ్డాడు. బుమ్రా ఫిట్‌నెస్ గురించి ఆందోళన ఉండగా, షమి తిరిగి జట్టులో చేరడం టీమ్ఇండియాకు ఎంతో ఊరట కలిగించిందని చెప్పవచ్చు. ఈవేళ ఛాంపియన్స్ ట్రోఫీ జట్టులో బుమ్రా కూడా ఉన్నాడు, అతడు ఫిట్‌గా ఇంగ్లాండ్‌తో మూడో వన్డేలో ఆడనున్నాడు.బుమ్రా, షమి ద్వయం కలిసి రాణించి, భారత్‌ను ఛాంపియన్స్ ట్రోఫీ విజేతగా నిలిపేందుకు అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



# హాలీవుడ్‌లోకి 'దిశ'!

**కబురు సినిమా జనవరి 21:** యువతరంలో మంచి క్రేజ్ ఉన్న బాలీవుడ్ నాయిక దిశా పటానీ. ఇటీవలే 'కంగువా'తో తమిళంలోకి అడుగుపెట్టి అందరి దృష్టినీ ఆకర్షించింది. భాషతో సంబంధం లేకుండా అవకాశాలను అందుకుంటున్న ఈ కథానాయిక.. ఇప్పుడు హాలీవుడ్‌లో కూడా సత్తా చాటాడానికి సిద్ధమైనట్లు తెలుస్తోంది. తాజాగా దిశ 'ఫాస్ట్ అండ్ ఫ్యూరియస్' నటుడు టైరీస్ గిబ్సన్‌తో ఓ వెబ్ సిరీస్ కోసం జోడీ కట్టినట్లు సమాచారం. ప్రస్తుతం చిత్రీకరణలో ఉన్న ఈ సిరీస్ సెట్స్ నుంచి కొన్ని ఫొటోలు నెట్టింట్లో చక్కర్లు కొడుతున్నాయి. మెక్సికోలో షూటింగ్ చేసుకుంటున్న ఈ ప్రాజెక్టులో నటుడు హ్యారీ గుడ్విన్స్ కూడా ఓ కీలక పాత్ర పోషిస్తున్నట్లు దిశ సన్నిహిత వర్గాలు తెలిపాయి. మరి బాలీవుడ్‌లో కుర్రకారుని ఉర్రూతలూగించే ఈమె.. ఇప్పుడు తన మొదటి హాలీవుడ్ ప్రాజెక్టుతో ఎలాంటి మాయ చేస్తోందో చూడాలి.


# అవతార్ 3..
## ప్రేక్షకుల ఊహకు మించి ఉంటుంది

**కబురు సినిమా జనవరి 21:** జేమ్స్ కామెరూన్ తెరకెక్కించిన విజువల్ వండర్ 'అవతార్'. దీని రెండు భాగాలు ప్రపంచవ్యాప్తంగా అత్యధిక ప్రేక్షకాదరణను పొంది రూ.కోట్లు వసూలు చేశాయి. ఇప్పుడు దీని మూడో భాగం భారీ అంచనాల మధ్య తెరకెక్కనుంది. 'అవతార్-ఫైర్ అండ్ యాష్' పేరుతో రానున్న ఈ సినిమాపై జేమ్స్ కామెరూన్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. గత రెండు చిత్రాలతో పోలిస్తే దీని నిడివి కూడా రెట్టింపు ఉంటుందన్నారు."ప్రేక్షకుల అంచనాలకు మించి ఈ చిత్రం ఉంటుంది. తెరపై ఈ విజువల్ వండర్‌ను చూసిన తర్వాత ప్రతిఒక్కరూ ఆశ్చర్యపోతారు. గతంలోని రెండు చిత్రాల్లో చూపిన వాటిని ఎక్కడా పునరావృతం కాకుండా చూసుకుంటున్నాం. వాటికి బదులుగా కొన్ని ధైర్యమైన ఎంపికలతో మీ ముందుకు వస్తాను. ఇలా ధైర్యం చేసి కొన్నింటిని సృష్టించకపోతే ప్రతిఒక్కరి సమయాన్ని, డబ్బును వృథా చేసినవాడిని అవుతాను. రెండు భాగాల్లో లేని అద్భుతాలను అవతార్ మూడో పార్ట్‌లో చూస్తారు. మీ అంచనాలకు మించిన లైవ్-యాక్షన్‌ని ఇందులో చూస్తారు. మరో కొత్త ప్రపంచం భిన్నమైన కథనం, విభిన్నమైన పాత్రలు ఇందులో కనిపిస్తాయి. ఈసారి పాత్రలపై ఎక్కువ దృష్టి పెడుతున్నాం" అని చెప్పారు. ప్రపంచ చిత్ర పరిశ్రమలో 'అవతార్' ఓ సంచలనం. హాలీవుడ్ దర్శకుడు జేమ్స్ కామెరూన్ సృష్టించిన ఓ అద్భుత ప్రపంచమిది. పండోర అనే కల్పిత గ్రహాన్ని సృష్టించి అందులోని ప్రకృతి అందాలను కళ్లు చెదిరే విజువల్ ఎఫెక్ట్స్‌తో అందరినీ కట్టిపడేశారు దర్శకుడు. ఆ తర్వాత 'అవతార్: ది వే ఆఫ్ వాటర్'తో మంచి ట్రీట్ ఇచ్చారు. ఆ ఫ్రాంచైజీలో రానున్న మూడో భాగాన్ని పంచ భూతాల్లో ఒకటైన అగ్నికి సంబంధించిన కాన్సెప్ట్‌తో రూపొందించనున్నారు. 2025 డిసెంబరు 19న ఇది ప్రేక్షకుల ముందుకురానుంది. అవతార్ ఫ్రాంచైజీలో రానున్న 'అవతార్ 4' 2029లో, చివరిగా రానున్న 'అవతార్ 5' డిసెంబరు 2031లో విడుదల చేయనున్నట్లు చిత్రబృందం గతంలోనే ప్రకటించిన సంగతి తెలిసిందే.



# మేలో విజయ్ చిత్రం!

**కబురు సినిమా జనవరి 21:** కథానాయకుడు విజయ్ దేవరకొండ .. దర్శకుడు గౌతమ్ తిన్ననూరి కలయికలో ఓ స్పై యాక్షన్ థ్రిల్లర్ చిత్రం ముస్తాబవుతోంది. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. ప్రస్తుతం ముగింపు దశలో ఉన్న ఈ సినిమా మే నెలాఖరున ప్రేక్షకుల ముందుకు రానుందని సమాచారం. దీనికోసం ఆ నెల 30వ తేదీని పరిశీలిస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే ఈ చిత్రం 90శాతం పూర్తి కాగా ఆఖరి షెడ్యూల్ ఫిబ్రవరి తొలి వారం నుంచి హైదరాబాద్‌లో మొదలు కానుంది. ఈ భారీ యాక్షన్ షెడ్యూల్ కోసం విజయ్ ప్రత్యేకంగా సన్నద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఆయన ఈ స్పై థ్రిల్లర్‌లో శక్తిమంతమైన పోలీస్ పాత్రలో కనువిందు చేయనున్నారు. ఈ చిత్రానికి సంగీతం: అనిరుధ్, ఛాయాగ్రహణం: గిరీశ్ గంగాధరన్.



# ఆస్పత్రి నుంచి సైఫ్ అలీఖాన్ డిశ్చార్జ్



**కబురు సినిమా జనవరి 21:** నటుడు సైఫ్ అలీఖాన్ తాజాగా డిశ్చార్జ్ అయ్యారు. తన ఇంట్లోకి చొరబడి దుండగుడు దాడి చేయగా నటుడికి గాయాలైన సంగతి తెలిసిందే. ఆరు రోజుల చికిత్స అనంతరం లీలావతి ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు వైద్యులు సైఫ్‌కు వారంపాటు బెడ్‌రెస్ట్ సూచించారు. ఇన్ఫెక్షన్ చేరకుండా ఉండేందుకు కొంతకాలం బయట వ్యక్తులకు దూరంగా ఉండాలని చెప్పినట్టు సమాచారం.మరికొంత సేపట్లో సైఫ్ ఇంటికి బయలుదేరనున్నారు. ప్రస్తుతం ఆయన వెంట తల్లి, నటి షర్మిలా టాగూర్ ఉన్నారు. సైఫ్ సతీమణి, నటి కరీనా కపూర్, కుమార్తె సారా అలీఖాన్ తదితరులు ఆస్పత్రి నుంచి కొంత సేపటి క్రితం ఇంటికి వెళ్లారు. సంబంధిత దృశ్యాలను కొందరు ఫోన్లలో చిత్రీకరించి.. సోషల్ మీడియాలో పోస్టు చేశారు.ఈ నెల 16న సైఫ్‌పై దాడి జరిగింది. నటుడి వెన్నెముకకు తీవ్రగాయమైంది. సర్జరీ చేసిన వైద్యులు వెన్నెముక నుంచి కత్తిని తొలగించారు. మరోవైపు, ఈ కేసు విషయమై ముమ్మరంగా దర్యాప్తు చేసిన పోలీసులు నిందితుడు మహ్మద్ షరీఫుల్ ఇస్లాం షెహజాద్‌ను అరెస్టు చేశారు. ప్రస్తుతం అతడు కస్టడీలో ఉన్నాడు.

# మంచి భవిష్యత్తుకు 'ఏఐ' మార్గం

**కబురు సినిమా జనవరి 21:** 'ఏఐ'ని ఉపయోగించి సినిమాలను రూపొందించడం వల్ల ప్రతి ఒక్కరికీ మంచి భవిష్యత్తును నిర్మించవచ్చని అంటున్నారు ప్రముఖ బాలీవుడ్ నటి, పర్యావరణ కార్యకర్త భూమి పెడ్నేకర్. దావోస్ వేదికగా జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ (డబ్ల్యూఈఎఫ్)లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా భూమి పెడ్నేకర్ మాట్లాడుతూ.. విద్యాపరమైన చిత్రాలను పెంపొందించడానికి, అలాగే అట్టడుగు వర్గాలను మెరుగుపరచడంలో 'ఏఐ' ముఖ్య పాత్ర పోషిస్తుంది. మౌలిక సదుపాయాలు, పారిశుధ్యం సరిగ్గా లేకపోవడమే అనారోగ్యానికి కారణం.. అని 2017లో విడుదలైన 'టాయిలెట్: ఏక్ ప్రేమకథ' సినిమాను గుర్తు చేశారు. ఇది దేశ వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలను చైతన్య పరిచింది. 'ఏఐ' సాంకేతికతతో మరింత గొప్పగా కథలు చెప్పడమే ఉన్నతంగా సినిమాలు రూపొందించొచ్చు"అని అభిప్రాయ పడ్డారు భూమి. సాంకేతికంగా, విజువల్ ఎఫెక్ట్‌తో ఏఐని ఉపయోగించి చిత్రాలను రూపొందించొచ్చు అన్నారు.



Printed & Published and owned by K. Shiva Kumar Goud, Printing at Srinika Printers, Railway Kaman Track, Sony Function Haal Road, Nizamabd.(TS). Editor: K. Shiva Kumar Goud. Registration No. APTEL/1999/00110/, kaburueveningdaily9106@gmail.com